PRGI Reg No -"APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...



ప్రతిక్షణం... ప్రజల కోసం...

www.netishubhodaya.com

96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 53, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, సోమవారం - 13 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## 'దీదీ'కి మైండ్ బ్లాంక్.. బెంగాల్ బరిలో బీజేపీ బ్రహ్మాస్త్రం



2లో

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రచార హోరును మరింతగా పెంచింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా విడుదల చేసిన 'సంకల్ప్ పత్ర' (మేనిఫెస్టో)ను తృణమూల్ కాంగ్రెస్ ఓటు బ్యాంకుకు గండికొట్టేలా రూపొందించారు. ముఖ్యంగా మహిళలు, యువతను ఆకర్షించడంతో పాటు, బెంగాలీ సంస్కృతిని కాపాడేలా బీజేపీ చేసిన హామీలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా

## 'బ్రహ్మోస్'పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...



2లో

ఢిల్లీ: ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న భౌగోళిక, రాజకీయ సమీకరణాల నేపథ్యంలో భారత్ ప్రాధాన్యత అంతకంతకూ పెరుగుతోంది. ముఖ్యంగా, దక్షిణ చైనా సముద్రంలో చైనా దూకుడును ఎదుర్కొనేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల

## 200కు పైగా సీట్లు గెలుచుకుంటాం.. సీఎం స్టాలిన్



2లో

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే సారథ్యంలోని సెక్యులర్ ప్రొగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లు గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని,

# బీసీ మహిళల ఉప కోటా కోసం ఢిల్లీని గడగడలాడిస్తాం: కల్వకుంట్ల కవిత

- బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె,
- గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించింది
- కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్
- ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా



2

హైదరాబాద్: మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ మహిళలకు ఉప కోటా సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతి వేడుకల సందర్భంగా

# రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు: కేటీఆర్

## అధికారం ఎవరికీ శాశ్వతం కాదు

- అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారు
- ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెర
- అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటాం
- కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు



2లో

హైదరాబాద్: తెలంగాణ సమాజాన్ని మోసం చేస్తూ, తన కుటుంబ సభ్యులు, అనుచరుల కోసం పేద ప్రజల భూములను అరాచకంగా లాక్కుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్... ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో గులాబీ జెండా ఎగరడం న్యాయానికి దక్కిన విజయమని పేర్కొన్నారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ వైపు ఉన్నప్పటికీ, అక్రమంగా చైర్మన్ పదవులను దక్కించుకోవాలని కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు సాగలేదని అన్నారు. ముఖ్యంగా 'ఫోర్త్ సిటీ', 'ఫ్యూచర్ సిటీ' పేరుతో రేవంత్ రెడ్డి భారీ భూ దందాకు తెరలేపారని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలకు ముందు ఫార్మా సిటీ భూములను రైతులకు తిరిగి ఇచ్చేస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ నేతలు, ఇప్పుడు అదే భూముల్లో కొత్త నగరాల పేరుతో నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. భట్టి విక్రమార్క, సీతక్క వంటి నేతలు పాదయాత్రలు చేసి ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి, ఇప్పుడు అదనంగా మరో 16,000 ఎకరాలను సేకరించాలని చూడటం వెనుక రేవంత్ రెడ్డి సోదరులు,

## పశ్చిమ బెంగాల్‌లో వచ్చే మార్పు ఇదే: ప్రధాని మోదీ

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు
- పశ్చిమ బెంగాల్‌లో మార్పును తీసుకురావడంలో విఫలమైంది
- టీఎంసీ జంగిల్ రాజ్, సిండికేట్ రాజ్‌కు ముగింపు పలకడమే బీజేపీ లక్ష్యం



2

## జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ: జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఖరారు



2

## 'తెలంగాణలో రేవంత్ పని అయిపోయింది'



2లో

- రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీపై సమరశంఖం పూరిస్తానని జీవన్‌రెడ్డి తెలిపారు
- తెలంగాణలో తదుపరి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేని జీవన్‌రెడ్డి ధీమా
- ' తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలమైంది.
- ఈనెల ఏప్రిల్ 20వ తేదీన కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుంటా.

జగిత్యాల: సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డిలపై కాంగ్రెస్ మాజీ నేత జీవన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఇక రేవంత్ పని అయిపోయిందంటూ హాట్ కామెంట్స్ చేశారు. తెలంగాణలో తదుపరి వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేని

## మీడియా రంగంలోకి విజయసాయిరెడ్డి..



2లో

అమరావతి: రాజకీయ రణక్షేత్రంలో పదునైన వ్యూహాలతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసిన చాణక్యుడు.. ఇప్పుడు తన రూటు మార్చారు. మైకు పట్టుకుని విమర్శలు చేయడం కాదు... ఏకంగా మైకులనే శాసించే మీడియా సామ్రాజ్యాన్ని నిర్మించేందుకు విజయసాయిరెడ్డి సిద్ధమయ్యారు. 'నమస్కారం... వార్తలు చదువుతోంది మీ విజయసాయిరెడ్డి' అని ఆయన నేరుగా అనకపోయినా.. తెలుగు మీడియా తెరపై సరికొత్త సంచలనానికి ఆయన తెరలేపారు.

# టీడీపీ కార్యాలయంలో శిక్షణ తరగతులు... క్రమం తప్పకుండా హాజరవుతున్న చంద్రబాబు

- చంద్రబాబు పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియకు శ్రీకారం
- గతంలో కంటే టీడీపీ ఓటు బ్యాంకు పెరగాలి,"
- కార్యకర్తల ఆర్థిక బలోపేతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు
- ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలి
- 'ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్' కార్యక్రమం చేపడతాం" అని హామీ



2లో

అమరావతి: ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ యంత్రాంగాన్ని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ, వారిలో నూతనోత్సాహం నింపుతున్నారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ఆయన క్రమం తప్పకుండా హాజరవుతూ పార్టీ శ్రేణులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. అదే సమయంలో, పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై స్పష్టత ఇస్తున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తల ఆర్థిక స్వావలంబన కోసం 'ఈ3' (ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్) అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన ప్రకటించారు. పార్టీ సీనియర్ నేతల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ శిక్షణా శిబిరాల్లో చంద్రబాబు చాలా చురుగ్గా పాల్గొంటున్నారు. శిక్షణ తీసుకుంటున్న నేతలు, కార్యకర్తలతో కలిసి కాఫీ తాగుతూ, వారితో నేరుగా సంభాషిస్తున్నారు. ఈ సందర్భంగా రాజకీయ, పరిపాలన అంశాలపై తన సుదీర్ఘ అనుభవాన్ని పంచుకుంటున్నారు. గతానుభవాలు, ప్రస్తుత ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ ప్రణాళికలను వారికి వివరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పథకాల అమలు తీరుపై కార్యకర్తల నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "క్లీన్ అండ్ గ్రీన్, క్లీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్న మనం, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నాం.

## అమరావతి ఖర్చు అసలు లెక్క ఇదీ..!!



2లో

- మాజీ సీఎం జగన్ తీసుకొచ్చిన మావీగన్ ప్రతిపాదన పైన రాజకీయంగా విమర్శలు
- రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్ట్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం
- మే నెలాఖరు నాటికి 90 శాతం ప్రభుత్వ భవనాలు సిద్ధమవుతాయని వెల్లడి

అమరావతి: అమరావతి కేంద్రంగా కీలక చర్చ సాగుతోంది. అమరావతికి చట్ట బద్దత కల్పిస్తూ పార్లమెంట్ లో ఆమోదించారు. దీంతో, అమరావతి కేంద్రంగా నిర్మాణాలు.. పెట్టబడులు వేగం పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో మాజీ సీఎం జగన్ తీసుకొచ్చిన మావీగన్ ప్రతిపాదన పైన రాజకీయంగా విమర్శలు వస్తున్నాయి. అమరావతి ఖర్చు పైనా కొత్త చర్చ మొదలైంది. దీంతో, మంత్రి నారాయణ అమరావతిలో చేస్తున్న ఖర్చు గురించి స్పష్టత ఇచ్చారు. అమరావతిలో నిర్మాణాలు.. ఖర్చు గురించి మంత్రి నారాయణ కీలక అంశాలను ప్రస్తావించారు. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్ట్‌పై వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అమరావతిలో పనులు వేగంతో మూడు షిఫ్టుల్లో జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, అధికారుల భవనాలు మే నెలాఖరుకు పూర్తవుతాయని చెప్పారు. మే నెలాఖరు నాటికి 90 శాతం ప్రభుత్వ భవనాలు సిద్ధమవుతాయని వెల్లడించారు.

## భోగాపురం పోర్టుకు ముహూర్తం ఫిక్స్..



2లో

అమరావతి: ఉత్తరాంధ్రలోని భోగాపురం విమానాశ్రయ నిర్మాణం దాదాపు పూర్తి కావొచ్చింది. ఇంకా కేవలం రెండు శాతమే పనులు మిగిలి ఉండటంతో ప్రారంభోత్సవానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి. పెండింగ్ పనులు మరో నెల రోజుల్లో పూర్తి చేసి జులైలో ప్రధాని మోదీ చేతుల మీదుగా విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి రామ్మోహననాయుడు ప్రకటించారు. జూలై 5న ప్రధాని పర్యటన ఉంటుందని, ఆ రోజే భోగాపురం విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణం కొలిక్కి రావడంతో ప్రారంభోత్సవంపై ప్రభుత్వం సన్నాహాలు మొదలుపెట్టింది.

## ‘దీదీ’కి మైండ్ బ్లాంక్.. బెంగాల్ బరిలో బీజేపీ బ్రహ్మాస్త్రం

మొదటి పేజి తరువాయి

ముఖ్యంగా మహిళలు, యువతను ఆకర్షించడంతో పాటు, బెంగాలీ సంస్కృతిని కాపాడేలా బీజేపీ చేసిన హామీలు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారాయి. బీజేపీ మేనిఫెస్టోలోని ఐదు ప్రధాన అంశాలు ఇవే..

చొరబాట్లపై ఉక్కుపాదం

అక్రమ చొరబాట్లను ఏమాత్రం సహించేది లేదని స్పష్టం చేసిన బీజేపీ.. చొరబాటుదారులను గుర్తించి, దేశం నుంచి పంపించే (డిటెక్ట్, డిలీట్, డిపోర్ట్) విధానాన్ని అమలు చేస్తామని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని తీసుకువస్తామని, అలాగే లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లను అరికట్టేందుకు కఠిన చట్టాలు రూపొందిస్తామని హామీ ఇచ్చింది.

మహిళలకు పెద్ద పీట

మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు భారీ నజరానాలు ప్రకటించింది. టీఎంసీ ప్రభుత్వం ఇస్తున్న ‘లక్ష్మీర్ భండార్’ సాయం కంటే దాదాపు రెట్టింపుగా ప్రతి మహిళకు నెలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగాలు, పోలీసు శాఖలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడంతో పాటు, 75 లక్షల మందిని ‘లఖపతి దీదీ’లుగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేసింది.

యువతకు ఉపాధి

నిరుద్యోగ సమస్యపై ప్రధానంగా ఫోకస్ పెట్టిన కమలనాథులు.. నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 భృతి ఇస్తామని ప్రకటించారు. రాబోయే ఐదేళ్లలో కోటి కొత్త ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు సృష్టిస్తామని హామీ ఇచ్చారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు 5 లక్షల మంది యువతకు చెరో రూ.10 లక్షల ఆర్థిక సాయం (సగం గ్రాంట్, సగం వడ్డీ లేని రుణం) అందించనున్నామని తెలిపారు.

బెంగాలీ సంస్కృతి పరిరక్షణ

తమను బయటి వ్యక్తులుగా ముద్రవేస్తున్న టీఎంసీ వాదనను తిప్పికొడుతూ.. బెంగాలీ ఆత్మగౌరవాన్ని కాపాడతామని బీజేపీ స్పష్టం చేసింది. ఇందులో భాగంగా వందేమాతరం మ్యూజియం, ఠాగూర్ కల్చరల్ సెంటర్ల ఏర్పాటుతో పాటు అన్ని శక్తిపీఠాలను కలుపుతూ ప్రత్యేక సర్క్యూట్ అభివృద్ధి చేస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది.

మౌలిక సదుపాయాల అభివృద్ధి

రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ.. తాజ్‌పూర్, కుల్పిలో ఆధునిక డీప్-సీ పోర్టులను నిర్మిస్తామని బీజేపీ తెలిపింది. సుందర్‌బన్స్ నుండి డార్జిలింగ్ వరకు నేరుగా జాతీయ రహదారితో పాటు, ఉత్తర బెంగాల్‌లో నాలుగు కొత్త నగరాల నిర్మాణాన్ని తమ ‘సంకల్ప్ పత్ర’లో ప్రముఖంగా పొందుపరిచింది.

## ‘బ్రహ్మోస్’పై ఆసక్తి చూపిస్తున్న ఆగ్నేయాసియా దేశాలు...

మొదటి పేజి తరువాయి

ఆగ్నేయాసియా దేశాలు భారత్ వైపు ఆశగా చూస్తున్నాయి. ఇందులో భాగంగా, భారత్-రష్యా సంయుక్తంగా అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని సమకూర్చుకోవడంపై అమిత ఆసక్తి కనబరుస్తున్నాయి. ఫిలిప్పీన్స్ తర్వాత తాజాగా ఇండోనేషియా కూడా బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలుకు నిర్ణయం తీసుకోవడమే దీనికి నిదర్శనం. భారత్... ఆగ్నేయాసియాను బ్రహ్మోస్ క్షిపణికి కీలక మార్కెట్‌గా పరిగణిస్తోంది. శబ్దం కంటే వేగంగా (మాక్ 2.8 నుంచి 3 మధ్య వేగంతో) ప్రయాణించే ఈ క్షిపణి, తన కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగలదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఇది నిరూపితమైంది. సుమారు 400 కిలోమీటర్ల పరిధి కలిగిన బ్రహ్మోస్‌ను భూమి, సముద్రం, గాలి, జలాంతర్గాముల వివిధ ఉపరితలాల నుంచి ప్రయోగించవచ్చు. ఈ ప్రత్యేకతల కారణంగా, చైనా నౌకాదళ దూకుడును నిలువరించేందుకు ఇది సరైన ఆయుధమని ఆగ్నేయాసియా దేశాలు భావిస్తున్నాయి. ఈ మేరకు ‘ఇండియా నరేటివ్’ తన కథనంలో వివరాలను వెల్లడించింది. ఇండియా నరేటివ్ నివేదిక ప్రకారం, దక్షిణ చైనా సముద్ర తీర దేశాలైన వియత్నాం, ఫిలిప్పీన్స్, ఇండోనేషియా వంటివి తమ నిరోధక సామర్థ్యాలను పెంచుకోవడంపై దృష్టి సారించాయి. చైనా ఇప్పటికే శక్తివంతమైన వ్యవస్థలను అభివృద్ధి చేయగా, బ్రహ్మోస్ వంటి క్షిపణులతో చిన్న దేశాలు కూడా అదే తరహా వ్యూహాన్ని అనుసరించి తమ సముద్ర జలాలను కాపాడుకోగలవని నివేదిక పేర్కొంది. ఇదే సమయంలో, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా అమెరికా తన క్షిపణి, నౌకాదళ వనరులను ఇండో-పసిఫిక్ నుంచి తరలిస్తోంది. దీంతో చైనా దూకుడును ఎదుర్కోవడంలో అమెరికా ఇచ్చే భద్రతా హామీలపై ఆగ్నేయాసియా దేశాల్లో అపనమ్మకం పెరుగుతోంది. అమెరికా 2025 జాతీయ భద్రతా వ్యూహంలో కూడా ఈ ప్రాంతానికి ప్రాధాన్యత తగ్గించడం వారి ఆందోళనలను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో, తమ సైనిక సామర్థ్యాన్ని పెంచుకునేందుకు ఆగ్నేయాసియా దేశాలు భారత్, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాలతో భాగస్వామ్యాలను విస్తరించుకుంటున్నాయి. భారత్ ఇప్పటికే 2024లో ఫిలిప్పీన్స్‌కు బ్రహ్మోస్ క్షిపణులను అందించింది. ఇప్పుడు ఇండోనేషియాతో ఒప్పందం కుదుర్చుకుంది. వియత్నాంతో దాదాపు 700 మిలియన్ డాలర్ల ఒప్పందానికి కూడా చేరువలో ఉంది. ఈ పరిణామాలు కేవలం ఆయుధ విక్రయాలుగానే కాకుండా, విస్తృత ఇండో-పసిఫిక్ భూ-వ్యూహాత్మక క్షేత్రంలో భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

## 200కు పైగా సీట్లు గెలుచుకుంటాం.. సీఎం స్టాలిన్

మొదటి పేజి తరువాయి

ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తెలిపారు. అన్నాడీఎంకే ఎలాంటి సిద్ధాంతాలు లేకుండా ఢిల్లీలోని బీజేపీకి మరబొమ్మలా మారిందని అన్నారు. తమ ఐదేళ్ల ద్రవిడియన్ తరహా పాలనలో లెక్కలేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, కలైంజ్ఞర్ మహిళా సాధికారతా పథకం కింద నెలకు రూ.1000 ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, పాఠశాల పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రెండు లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని చెప్పారు. ‘ప్రజలకు మా పార్టీ పట్ల అపారమైన ప్రేమ, నమ్మకం ఉన్నాయి. సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ 200కు పైగా సీట్లలో గెలిచి ద్రవిడియన్ మోడల్ 2.0 ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది’ అని స్టాలిన్ తెలిపారు. కాంగ్రెస్‌తో సీట్ల పంపకాల వ్యవహారంలో ఈసారి సంక్లిష్టంగా మారడంపై అడిగినప్పుడు, సీట్ల కేటాయింపు విషయంలో అలాంటివి మామూలేనని, అయితే చర్చలు సుహృద్భావ వాతావరణంలో ముగిసాయని చెప్పారు. కూటమిలోని నేతలు, కార్యకర్తలు సమష్టిగా అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారని చెప్పారు. 2019 నుంచి తమ కూటమి మరింత బలపడిందని, మరిన్ని పార్టీలు వచ్చి చేరాయని చెప్పారు. తమిళనాడులోనే కాకుండా పుదుచ్చేరిలోనూ తమ కూటమి గెలుపు సాధిస్తుందని చెప్పారు. ఏప్రిల్ 9న పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది.

పవర్ సెంటర్ వ్యాఖ్యలపై..

ముఖ్యమంత్రి కుటుంబం పవర్ సెంటర్‌లా వ్యవహరిస్తోందంటూ అన్నాడీఎంకే చీఫ్ ఎడప్పాడి పళనిస్వామి ఆరోపణలను స్టాలిన్ కొట్టివేశారు. పళనిస్వామి కట్టుకథలపై తాను స్పందించాల్సిన పనిలేదని అన్నారు. రాష్ట్రంలో మహిళలపై నేరాలపై పళనిస్వామి చేస్తున్న ఆరోపణలను ప్రస్తావిస్తూ, పొల్లాచ్చి లైంగిక దాడుల ఘటన పళనిస్వామి సారథ్యంలోని అన్నాడీఎంకే అవకతవకల పాలనకు ఒక నిదర్శనమని, అప్పటి మహిళా ఐపీఎస్‌పై కూడా లైంగిక వేధింపులు జరిగాయని చెప్పారు. మహిళల భద్రతపై కానీ, శాంతిభద్రతలపై కానీ పళనిస్వామికి మాట్లాడే అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. తమిళనాడును గుట్కా గిడ్డంగిగా ఆయన మార్చారని, తాము అధికారంలోకి వచ్చాక కఠిన చర్యలు తీసుకుని గుట్కా సహా మాదకద్రవ్యాలను తుడిచిపెట్టామని, కఠిన చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఉద్యోగాలు చేసే మహిళల భద్రతకు హాస్టళ్లు ఏర్పాటు చేశామని, మహిళలపై నేరాలకు కఠిన చర్యలు అమలయ్యేలా సంబంధిత చట్టాలలో మార్పులు చేశామని స్టాలిన్ చెప్పారు. తమిళనాడులో వర్కింగ్ ఉమెన్స్ ఎక్కువనీ, వారి భద్రతకు తాము భరోసాగా ఉన్నామని తెలిపారు. మహిళల భద్రత విషయంలో దేశంలోనే తమిళనాడు నెంబర్ వన్ స్థానంలో ఉందని చెప్పారు.

## జగిత్యాలలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ

### జీవన్ రెడ్డి చేరికకు ముహూర్తం ఖరారు

హైదరాబాద్: జగిత్యాలలో ఈనెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ కోసం గులాబీ శ్రేణులు సమరోత్సాహంతో సిద్ధమవుతున్నాయి. సుమారు లక్ష మంది జనసమీకరణే లక్ష్యంగా పార్టీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సభకు సంబంధించి అనువైన ప్రదేశాన్ని ఖరారు చేసేందుకు ఈరోజు పార్టీ ముఖ్య నేతలు క్షేత్రస్థాయిలో పర్యటించారు. జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన సీనియర్ నేత జీవన్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ వసంత తదితరులు కలిసి జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదానం, ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని కాలేజీ గ్రౌండ్, మోతే రోడ్డు ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. ఈ బహిరంగ సభకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడటానికి ప్రధాన కారణం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో మాజీ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా పార్టీలో చేరనుండటమే. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ గడ్డపై కేసీఆర్‌తో కలిసి పనిచేసే అవకాశం రావడం తన అదృష్టమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో పోల్చితే ఈ రెండేళ్లలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భారీ సభ ద్వారా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ తన పట్టును మరోసారి నిరూపించుకోవాలని భావిస్తోంది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి

హైదరాబాద్:హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోవడంతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. అతివేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో, ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. మృతులు పాతబస్తీకి చెందిన అబ్దుల్ సోహెద్ (20) షేక్ సాహిల్ (17)గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్లుగా పనిచేస్తున్నట్లు సమాచారం. పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## పశ్చిమ బెంగాల్‌లో వచ్చే మార్పు ఇదే: ప్రధాని మోదీ

ముర్షిదాబాద్: పశ్చిమ బెంగాల్ ఎన్నికల వేళ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తృణమూల్ కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అధికార టీఎంసీ కూడా వామపక్ష పాలనా విధానాన్ని అనుకరించిందని, పశ్చిమ బెంగాల్‌లో మార్పును తీసుకురావడంలో విఫలమైందని చెప్పారు. ముర్షిదాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీని ప్రజలు అదే విధంగా ఓడిస్తారని అన్నారు. “స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత.. బెంగాల్‌ను సవాలు చేసిన ప్రతి ఒక్కొక్కరి అహంకారం ఛిద్రమైపోతూ వచ్చింది. మొదట బ్రిటిష్, తరువాత కాంగ్రెస్, చివరికి వామపక్షాలు తమ అహంకారంతో కుప్పకూలిపోయాయి. ఇప్పుడు బెంగాల్ ప్రజలు టీఎంసీ అహంకారాన్ని ఛిద్రం చేస్తారు” అని ప్రధాని చెప్పారు. ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీఎంసీ వాగ్దానాలను నెరవేర్చలేకపోయిందని చెప్పారు. అవినీతి వ్యవస్థలను టీఎంసీ ప్రోత్సహించిందని మోదీ ఆరోపించారు. గతంలో ఉన్న ప్రభుత్వాలకు సంబంధించిన వర్గాలు ప్రస్తుత ప్రభుత్వంలో కొనసాగుతున్నాయని అన్నారు. “వామపక్షాలకు చెందిన గూండాలు, సిండికేట్లు అన్నీ తృణమూల్‌లోకి మారాయి. ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, పశువుల అక్రమ రవాణా నుంచి కమిషన్ల వరకు అన్నింటిని ఇప్పుడు టీఎంసీ నియంత్రిస్తోంది” అని అన్నారు. దేశ భద్రత తమకు అత్యంత ముఖ్యమైనదని మోదీ చెప్పారు. పశ్చిమ బెంగాల్‌లో యూసీసీ అమలు చేసి, బుజ్జగింపు రాజకీయాలకు ముగింపు పలుకుతామని అన్నారు. టీఎంసీ జంగిల్ రాజ్, సిండికేట్ రాజ్‌కు ముగింపు పలకడమే బీజేపీ లక్ష్యమని తెలిపారు. ఈ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పరిస్థితి మారుతుందని చెప్పారు. కాగా, ఏప్రిల్ 23, 29 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ జరగనుంది. ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.

## టీడీపీ కార్యాలయంలో శిక్షణా తరగతులు...

### క్రమం తప్పకుండా హాజరవుతున్న చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

క్లీన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీని నిలిపేలా ప్రతి కార్యకర్త పనిచేయాలి. పాజిటివ్ పాలిటిక్స్ చేస్తూ, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలి. గతంలో కంటే టీడీపీ ఓటు బ్యాంకు పెరగాలి,” అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని సూచించారు. కార్యకర్తల ఆర్థిక బలోపేతంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. “పార్టీ నేతలు, కార్యకర్తల కోసం ఈ3 ప్రోగ్రాం తీసుకొస్తాం. నీతి, నిజాయతీలతో కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ‘ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్‌మెంట్’ కార్యక్రమం చేపడతాం” అని హామీ ఇచ్చారు. “నా కుటుంబం కోసం ఏ విధంగా ఆలోచించానో, టీడీపీ కుటుంబం కోసం కూడా అదే విధంగా ఆలోచిస్తున్నాను” అని ఆయన పేర్కొనడం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రత్యర్థి పార్టీల తీరును సమర్థంగా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు.

## అమరావతి ఖర్చు అసలు లెక్క ఇదీ..!!

మొదటి పేజి తరువాయి

ట్రంక్ రోడ్లు, లేఅవుట్ పనులు 2027 నాటికి పూర్తి అవుతాయని, ఐకానిక్ టవర్లు సహా ప్రధాన నిర్మాణాలు 2028 ఆగస్టు నాటికి సిద్ధం చేస్తామని మంత్రి వెల్లడించారు. మూడు సంవత్సరాల్లో అమరావతి ఫస్ట్ ఫేజ్ పూర్తి చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. రాజధాని సెల్ఫ్ సస్టైనబుల్ సిటీ కాదన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమన్నారు. 2014లోనే ల్యాండ్ పూలింగ్ ద్వారా స్పష్టమైన ప్రణాళిక రూపొందించామని చెప్పారు.

తొలి విడత నిర్మాణలు వచ్చే ఏడాదికి పూర్తి

కాగా, భవిష్యత్తులో భూముల విలువ పెరుగుదల దృష్ట్యా 5 వేల ఎకరాలు రిజర్వ్ చేసినట్లు తెలిపారు. ఆ భూముల విలువతో తీసుకున్న రుణాలు చెల్లించే విధంగా ప్లాన్ చేశామని వివరించారు. రాజధాని ఖర్చులపై తప్పుదారి పట్టించే ప్రచారం జరుగుతోందని.. స్క్వేర్ ఫీట్ ధరలను వక్రీకరిస్తున్నారని మంత్రి ఆరోపించారు. హైదరాబాద్ సెక్రటేరియట్‌లో స్క్వేర్ ఫీట్‌కు రూ.12 వేలు, ఢిల్లీ సెంట్రల్ విస్టాలో రూ.16 వేలు ఖర్చు అయ్యిందని మంత్రి తెలిపారు. వాటితో పోల్చితే అమరావతి ఖర్చులు సమంజసమేనని స్పష్టం చేశారు. ఇన్‌సైడర్ ట్రేడింగ్ ఆరోపణలను హైకోర్టు ఇప్పటికే కొట్టేసిందని మంత్రి గుర్తు చేశారు. ప్రణాళికలకు అనుగుణంగానే పనులు జరుగుతున్నాయని మంత్రి నారాయణ చెప్పుకొచ్చారు. రైతులకు రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు సాఫీగా సాగుతోందని చెప్పారు. ల్యాండ్ అక్విజిషన్ ప్రక్రియ ఈ నెలలో పూర్తవుతుందని.. దీంతో ప్రాజెక్టులకు ఉన్న అడ్డంకులు తొలగిపోతాయని చెప్పారు.

## భోగాపురం పోర్టుకు ముహూర్తం ఫిక్స్..

విమానాశ్రయాన్ని జాతికి అంకితం చేసే కార్యక్రమానికి రావాలంటూ ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ప్రస్తుతం విమానాశ్రయ నిర్మాణం పూర్తయిందని కేవలం చిన్నచిన్న తుది మెరుగులు దిద్దాల్సిన పనులు మాత్రమే ఉన్నట్లు చెబుతున్నారు. మరోవైపు విమానాశ్రయానికి జాతీయ రహదారి, బీచ్ రోడ్డుకు కలిపే లింకు రోడ్ల పనులు వేగంగా పూర్తి చేస్తున్నారు. ఇది అందుబాటులోకి వస్తే రాష్ట్రంలోనే అతిపెద్ద అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చినట్లు అవుతుందని అంటున్నారు. రాష్ట్ర ఆర్థిక రంగానికి ఛోదక శక్తిలా మారిన విశాఖ నగరం మరింత అభివృద్ధి చెందేలా ఈ విమానాశ్రయం ఉపయోగపడుతుందని చెబుతున్నారు. అదేవిధంగా విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర రూపురేఖలు కూడా మారనున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. విమానాశ్రయంలో అత్యాధునిక సౌకర్యాలు కల్పించినట్లు ప్రభుత్వం చెబుతోంది. దాదాపు 3.8 కి.మీ. రన్ వే నిర్మించారు. ఇది దేశంలోనే అతిపెద్ద రన్ వేగా చెబుతున్నారు అదేవిధంగా 40 చెక్ ఇన్ కౌంటర్లు, 26 ఇమ్మిగ్రేషన్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. 18 విమానాలను నిలిపే సామర్థ్యంతో ఏప్రాన్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన విమానాశ్రయం నిర్మాణం పూర్తికావడం విశేషంగా చెబుతున్నారు. రాష్ట్ర విభజన అనంతరం 2019 ఫిబ్రవరి 14న ముఖ్యమంత్రి చంద్రబాబు తొలిసారిగా పునాది రాయి వేశారు. సుమారు 2,700 ఎకరాల్లో దీనిని నిర్మించాలని అప్పట్లో ప్రణాళిక రూపొందించారు. అయితే అప్పటికే ఎన్నికల సమయం దగ్గరపడటంతో పనులు ముందుకు చేయలేకపోయారు. ఆ తర్వాత కొలువుదీరిన వైసీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సైతం కొన్ని మార్పులతో భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణానికి సిద్ధమయ్యారు. న్యాయపరమైన చిక్కులు, భూసేకరణ సమస్యలు పరిష్కారం అయిన తర్వాత 2023 మే 3న అప్పటి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి జీఎంఆర్ (+వీ=) గ్రూపుతో కలిసి అధికారికంగా పనులకు శ్రీకారం చుట్టారు. ఇలా రెండుసార్లు శంకుస్థాపనలు జరిగిన భోగాపురం విమానాశ్రయం పనులు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరుగులు పెట్టించారు. ఉత్తరాంధ్రకే చెందిన శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్ర పౌరవిమానయాన మంత్రిగా ఉండటంతో ప్రతివారం పనులు సమీక్షించి విమానాశ్రయం నిర్మాణంలో జాప్యం లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో కేవలం 21 నెలల కాలంలో పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధమైనట్లు ప్రభుత్వ వర్గాలు ప్రచారం చేస్తున్నాయి.

## మీడియా రంగంలోకి విజయసాయిరెడ్డి..

అమరావతి: రాజకీయ రణక్షేత్రంలో పదునైన వ్యూహాలతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసిన చాణక్యుడు.. ఇప్పుడు తన రూటు మార్చారు. మైకు పట్టుకుని విమర్శలు చేయడం కాదు... ఏకంగా మైకులనే శాసించే మీడియా సామ్రాజ్యాన్ని నిర్మించేందుకు విజయసాయిరెడ్డి సిద్ధమయ్యారు. ‘నమస్కారం... వార్తలు చదువుతోంది మీ విజయసాయిరెడ్డి’ అని ఆయన నేరుగా అనకపోయినా.. తెలుగు మీడియా తెరపై సరికొత్త సంచలనానికి ఆయన తెరలేపారు. రాజకీయాలకు ‘గుడ్ బై’ చెప్పిన ఈ మాజీ రాజ్యసభ సభ్యుడు, ఇప్పుడు కలం పట్టి సత్తా చాటుతారా? లేక తన మీడియా సంస్థతో రాజకీయ సమీకరణాలను తిరగరాస్తారా? ఇప్పుడున్న కాంపిటీషన్ ను తట్టుకొని నిలబడుతారా? మీడియాను నిలబెడుతాడా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.. ఇప్పుడు ఇదే ఇరు రాష్ట్రాల్లో హాట్ టాపిక్ గా మారింది! వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ కీలక నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. విజయసాయిరెడ్డి తన జీవితంలో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించబోతున్నారు. రాజకీయాలకు అధికారికంగా స్వస్తి పలికిన అనంతరం.. ఆయన ఇప్పుడు మీడియా రంగంపై దృష్టి సారించడం తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనంగా మారింది. తాను త్వరలోనే ఒక అత్యాధునిక డిజిటల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించనున్నట్లు.. అది క్రమంగా పూర్తిస్థాయి శాటిలైట్ న్యూస్ ఛానల్‌గా రూపాంతరం చెందుతుందని ఆయన అధికారికంగా ప్రకటించారు. విజయసాయిరెడ్డి తన మీడియా ప్రస్థానాన్ని వ్యూహాత్మకంగా ప్లాన్ చేసినట్లు కనిపిస్తోంది. నేటి కాలంలో డిజిటల్ మీడియా ప్రభావం అధికంగా ఉన్న నేపథ్యంలో తొలుత డిజిటల్ వేదికగా వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఈ ప్లాట్‌ఫామ్ స్థిరపడిన తర్వాత దాన్ని విస్తరించి ఒక సమగ్రమైన తెలుగు శాటిలైట్ న్యూస్ ఛానల్‌ను తీసుకురావడమే తన అంతిమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఈ సంస్థ కేవలం తెలుగుకే పరిమితం కాకుండా తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లోనూ వార్తలను అందిస్తూ జాతీయ స్థాయి ప్రమాణాలను పాటించబోతోంది. సాధారణంగా రాజకీయ నాయకులు స్థాపించే మీడియా సంస్థలు ఏదో ఒక పార్టీకి కొమ్ముకాస్తాయనే విమర్శ ఉంటుంది. అయితే విజయసాయిరెడ్డి దీనిపై స్పష్టతనిచ్చారు. తన మీడియా సంస్థ ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా ఉండదని ఆయన స్పష్టం చేశారు. రైతులు, మహిళలు, యువత, కార్మికులు , సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలను వెలుగులోకి తీసుకురావడమే ఈ ఛానల్ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించకుండా సమతుల్యమైన వాస్తవాధారిత జర్నలిజాన్ని ప్రోత్సహిస్తామని ఆయన హామీ ఇచ్చారు. వాస్తవానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నప్పుడే విజయసాయిరెడ్డి మీడియా రంగంపై ఆసక్తి చూపేవారు. అప్పట్లో కొన్ని ప్రధాన స్రవంతి మీడియా సంస్థల వైఖరిని తప్పుబడుతూ తానే స్వయంగా ఒక మీడియాను స్థాపించి చూపిస్తానని సవాల్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే రాజకీయ బాధ్యతల వల్ల అప్పట్లో అది సాధ్యపడలేదు. ఇప్పుడు రాజకీయాల నుంచి తప్పుకున్నాక తన పాత ఆలోచనకు కార్యరూపం ఇచ్చేందుకు ఆయన రంగం సిద్ధం చేసుకున్నారు. “మీడియా రంగం నిర్వహణ చాలా క్లిష్టమైనది.. కానీ ప్రజా సమస్యలను వినిపించే బలమైన వేదిక అవసరమని నేను నమ్ముతున్నాను.” అని విజయసాయిరెడ్డి ప్రకటించారు. ప్రస్తుతం తెలుగు మీడియా రంగంలో విపరీతమైన పోటీ ఉంది. ఇప్పటికే అనేక స్థిరపడిన ఛానళ్లు ఉండగా కొత్తగా వచ్చి తన ముద్ర వేయడం విజయసాయిరెడ్డికి ఒక పెద్ద సవాలు... అంత ఈజీ కూడా కాదు.. భారీ పెట్టుబడులతో పాటు విశ్వసనీయత కలిగిన జర్నలిస్టులను ఎంచుకోవడం అత్యవసరం. ఇప్పటికే సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో సంప్రదింపులు జరుగుతున్నట్లు సమాచారం. రాజకీయ నేపథ్యం ఉన్న వ్యక్తిగా వార్తల్లో నిష్పక్షపాతాన్ని ఎలా కాపాడతారనేది ప్రేక్షకులు గమనించే అంశం. రాజకీయ చాణక్యుడిగా పేరున్న విజయసాయిరెడ్డి మీడియా రంగంలో తన ‘సెకండ్ ఇన్నింగ్స్’ను ఎలా నడిపిస్తారో వేచి చూడాలి. ఈ సరికొత్త ప్రయోగం విజయవంతమైతే తెలుగు మీడియా ముఖచిత్రంలో మరో కీలక మార్పు చోటుచేసుకునే అవకాశం ఉంది.

## ‘తెలంగాణలో రేవంత్ పని అయిపోయింది’

మొదటి పేజి తరువాయి

ఇక తాను పీసీసీ ప్రెసిడెంట్ కాకుండా అడ్డుకున్నది జానారెడ్డినే అంటూ మండిపడ్డారు. జగిత్యాల నుంచి మీడియా మాట్లాడిన జీవన్‌రెడ్డి.. ‘ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి విఫలమైంది. ప్రస్తుతం ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబు.. తెలంగాణ రాష్ట్రానికి షాడో సీఎంగా వ్యవహరిస్తున్నారు.

తెలంగాణ షాడో సీఎం చంద్రబాబు..

కాంగ్రెస్‌లో చేరేటప్పుడు టీడీపీ ఎమ్మెల్సీగా ఉన్న రేవంత్ శాసనమండలి ఛైర్మన్‌కు రాజీనామా లేఖ పంపకుండా చంద్రబాబుకు పంపినప్పుడే ఆయన విధేయత అర్థమైంది. ఇప్పుడున్నది ఒర్జినల్ కాంగ్రెస్ కాదు. దానికి ప్రధాన కారకుడు సీఎం రేవంత్. మల్కాజిగిరి ఎంపీగా ఉన్నప్పుడు ఏడు శాసనసభ స్థానాల్లో ఎక్కడా గెలిపించుకోలేని రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి చేశారు. ముఖ్యమంత్రి అయినాక కూడా మహబూబ్ నగర్ లో వంశీచంద్ రెడ్డిని ఎంపీగా గెలిపించుకోలేని అసమర్థ నాయకుడు రేవంత్. నేను పార్టీ నుంచి వెళ్లిపోవడానికి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ని ఓ టూల్‌గా వాడారు. నేను పీసీసీ ప్రెసిడెంట్ కాకుండా అడ్డుకున్నది జానారెడ్డి. ఉప ఎన్నిక నేపథ్యాన్ని ముందుపెట్టి జానారెడ్డి నన్ను అడ్డుకున్న కుట్రదారులు. కేసీఆర్ దగ్గరకు వెళ్లితే ఏమవుతుందో తెలుసానని చాలామంది మాట్లాడుతున్నారు. కడియం శ్రీహరిని డిప్యూటీ సీఎం చేశాడు, తుమ్మలను ఎమ్మెల్సీ చేసి మంత్రిని చేశాడు, కేకేను సెక్రటరీ జనరల్ చేశాడు, ఆయన కూతురికి మేయర్ ఇచ్చాడు. ఇంకేం కావాలి..?, ప్రజల్లో బీఆర్ఎస్ రావాలనే చర్చ ఉధృతంగా జరుగుతోంది

కేసీఆర్ తో దోస్తీ...రేవంత్ తో కటీఫ్.. పొలిటికల్ ఫ్యూచర్‌పై క్లారిటీ..

కాంగ్రెస్‌పై సమరశంఖం పూరిస్తా..

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీపై సమరశంఖం పూరిస్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. జీవన్ రెడ్డి ఎవరో సంధించే అస్త్రం కాదు.. జీవన్ రెడ్డే అస్త్రాలు సంధించే నాయకుడన్నారు. ఈనెల ఏప్రిల్ 20వ తేదీన కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుంటా. భారీ బహిరంగ సభలో కేసీఆర్ మాట్లాడుతారు’ అని పేర్కొన్నారు. చిన్నారెడ్డికి టిక్కెట్ ఇస్తానని మొండిచేయి చూపించారని. రాజ్యసభ ఇస్తానని చెప్పి రేవంత్ అనుచరుడికి కట్టబెట్టారన్నారు. ఇవన్నీ కాంగ్రెస్ దృష్టికి తీసుకెళ్లానని, లేఖలు రాశానన్నారు. కాంగ్రెస్ వైఖరితో తీవ్రంగా కలత చెందే రాజీనామా చేశానన్నారు.

## రేవంత్ రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోతారు: కేటీఆర్

మొదటి పేజి తరువాయి

అనుచరుల ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఉన్న సిటీలో దోమల నివారణ కూడా చేయలేని ప్రభుత్వం, ఫ్యూచరే లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతామంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇక నిషేధిత భూముల జాబితాను అడ్డం పెట్టుకుని రాష్ట్రంలో పెద్ద ఎత్తున సెటిల్మెంట్లు జరుగుతున్నాయని కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 16 లక్షల ఎకరాలుగా ఉన్న నిషేధిత భూముల సంఖ్యను ఏకంగా కోటి ఎకరాలకు పెంచి, భూ యజమానులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని మండిపడ్డారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేస్తూ భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో స్థానిక ఎమ్మెల్యే అరాచకాలు పెచ్చుమీరాయని, హోటళ్లు, బార్ల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడకుండా నిలబడిన కార్యకర్తలకు అండగా ఉంటామని, నిబంధనలు అతిక్రమించి కాంగ్రెస్‌కు వత్తాసు పలికే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తి లేదని కేటీఆర్ స్పష్టం చేశారు.

## బీసీ మహిళల ఉప కోటా కోసం

### ఢిల్లీని గడగడలాడిస్తాం: కల్వకుంట్ల కవిత

మొదటి పేజి తరువాయి

బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు స్థానం కల్పించకపోవడంపై కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. బీసీ మహిళలకు ఉప కోటా ఇవ్వకపోవడం అంటే పాలకులకు ఆ వర్గాల పట్ల గౌరవం లేదని అర్థమని, కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా మరోసారి పూలే పుట్టారా అన్నట్లుగా జాగృతి ఆధ్వర్యంలో ఉద్ధృత పోరాటం చేస్తామని ఆమె హెచ్చరించారు. పార్లమెంట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహిళా బిల్లుపై జరగనున్న చర్చా సమయంలో తాను స్వయంగా ఢిల్లీకి వెళ్లి వివిధ రాజకీయ పార్టీల నేతలను కలుస్తానని కవిత వెల్లడించారు. కేవలం మెజారిటీ ఉందన్న అహంకారంతో బీసీలకు అన్యాయం చేస్తూ బిల్లును ఆమోదిస్తే ఊరుకునేది లేదని తేల్చిచెప్పారు. మరోవైపు రాష్ట్రంలో పూలే విగ్రహ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న జాప్యాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. అసెంబ్లీ ప్రాంగణంలో పూలే విగ్రహం పెట్టాలని డిమాండ్ చేస్తే... ట్యాంక్ బండ్ వద్ద పెడతామని చెప్పి, ఇప్పటికీ పనులు పూర్తి చేయలేదని మండిపడ్డారు. కనీసం అంబేద్కర్ జయంతి నాటికైనా ఆ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల సమస్యలపై కూడా కవిత ఈ సందర్భంగా గళమెత్తారు. వారి క్రమబద్ధీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందని, కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనల్లో తమ నాయకులు పాల్గొంటారని ప్రకటించారు. గతంలో ఆర్టిజన్ల వేతనాలు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేస్తూ, ఇప్పుడు వారిపై ప్రభుత్వం చర్యలకు దిగాలని చూడటం సరికాదన్నారు. పూలే చూపిన సామాజిక న్యాయం బాటలో నడుస్తూ అణగారిన వర్గాల హక్కుల కోసం అహర్నిశలు శ్రమించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని ఆమె కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## హైవేపై నిలిపిన వాహనాలే టార్గెట్

నల్గొండ,: రోడ్డుపక్కన నిలిపి ఉంచిన వాహనాల్లో డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆరుగురు అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్గొండ పోలీసులు పట్టుకున్నారు. నిందితులలో ఓ మైనర్ కూడా ఉన్నాడు. ఆ ముఠా నుంచి 1000 లీటర్ల డీజిల్ సహా.. రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసులు ఉన్నట్లు జిల్లా అదనపు ఎస్పీ జి.రమేష్ వెల్లడించారు. హైవేలపై ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా అర్ధరాత్రి డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. నల్లగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా అదనపు ఎస్పీ జి. రమేష్ శనివారం మీడియా సమావేశంలో ఈ ముఠాకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. చాలా కాలంగా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన రహదారుల పక్కన నిలిపి ఉంచిన లారీలు, ఇతర భారీ వాహనాల ట్యాంకుల నుండి డీజిల్ దొంగలిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ క్రమంలో నిఘా పెంచిన పోలీసులు ఆరుగురు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. అదుపులోకి తీసుకున్న నిందితుల వద్ద నుంచి సుమారు రూ. 40 లక్షల విలువైన ఆస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 1000 లీటర్ల డీజిల్, రెండు డీసీఎం వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, దొంగతనానికి వాడే ఇతర పనిముట్లు ఉన్నాయి. ఈ ముఠా సభ్యులపై గతంలోనే 20కి పైగా కేసులు నమోదై ఉన్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. ఈ ముఠా అర్ధరాత్రి సమయాల్లో హైవేల వెంట ఆగి ఉన్న వాహనాలను గమనించి, డ్రైవర్లు నిద్రపోతున్న తరుణంలో అత్యంత వేగంగా డీజిల్ ట్యాంకుల సీల్ తొలగించి డీజిల్‌ను తమ వాహనాల్లోకి తరలించేవారు. హైవేలపై వాహనాలు నిలిపే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచించారు.

## పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం

ములుగు,ఏప్రిల్11(ఆర్ఎన్ఎ):మేడారం సమ్మక్క- సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్దదెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు.శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్

పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు.

ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో ’ప్రీ-ప్రైమరీ స్కూల్స్’గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క.

ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

## శోభాయమానంగా చైత్ర మాసం శ్రావణా నక్షత్ర శ్రీగిరి గిరిప్రదక్షిణ

**- ఆధ్యాత్మిక దీప్తితో అలరారిన ఒంగోలు నగరం**



ఒంగోలు, నేటి శుభోదయ ::: శ్రీవారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రమును పురస్కరించుకొని చైత్రమాసం బహుళ దశమి, ఏప్రిల్ 12, ఆదివారం ఉదయం శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో శ్రీగిరి గిరిప్రదక్షిణ కార్యక్రమం ఒంగోలు నగరంలో అత్యంత శోభాయమానంగా భక్తియుతంగా జరిగింది. అడుగడుగునా భక్తుల నిరాజనాలందుకున్న ఇరుదేవేరులతో శ్రీ వేంకటేశ్వర స్వామి. శ్రీగిరి పాద పీఠం వద్దగల బాపూజీ గోశాలలో గోపూజ నిర్వహించి శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఉత్సవ మూర్తులను సర్వాంగ సుందరంగా



తులసి, పుష్పమాలతో అలంకరించిన పల్లకిలో ప్రతిష్ట చేసి భక్తులు తమ భుజస్కందాలపై మోస్తూ గోవిందనామావళి పలుకుతూ చక్రతాళ్వార్ సెంగోల్, గరుడ, హనుమాన్, శంకు చక్ర త్రిపుండ్రాలను చేపట్టి జిల్లా కోర్టు, గ్రంథాలయం, కేశవ స్వామిపేట, భగీరథ మందిరం, వేప అంకమ్మతల్లి మందిరం, సీతారామపురం, గద్దలగుంట, రాజాపనగల్ రోడ్డు మీదుగా శ్రీగిరి చేరి అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ కోశాధికారి వలేటి కృష్ణారావు, దేసు కృష్ణ, బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, కనమర్లపూడి బాల కోటేశ్వరరావు, గ్రంథి సుధీర్, గ్రంధి కిషోర్, జగదీశ్వరి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## నేడు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక - మీకోసం నిర్వహిస్తాం

**-కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ**



మచిలీపట్నం, ఏప్రిల్ 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ఈ నెల 13వ తేదీ సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం 10:30 గంటల నుండి మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక- కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ వివరించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజేయవచ్చన్నారు. మీకోసం --ప్రజా సమస్యల పరిష్కార వేదిక కాల్ సెంటర్ నంబర్ 1100 కు ప్రజలు ఎవరైనా సరే కాల్ చేసి అర్జీ నమోదు చేసుకోవడంతోపాటు వారి అర్జీ స్థితిని తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు ఎవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్ సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు.ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్ లు కూడా యధా విధంగా జరుగుతాయన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసినదిగా కలెక్టర్ కోరారు.

## యార్లగడ్డ విదేశీయానానికి ఎట్టకేలకు షరతులతో కోర్టు అనుమతి

**-అమెరికా పర్యటన పూర్తి వివరాలు ఇవ్వాలి**



గన్నవరం, ఏప్రిల్ 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) గత ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసుల బాధలు టిడిపి ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు తప్పడం లేదు. ఈ అక్రమ కేసులు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అమెరికా పర్యటనకు అడ్డంకిగా నిలిచాయి. అమెరికాలోని తన వ్యాపార కార్యకలాపాలను ప్రత్యక్ష పర్యవేక్షణ కు గాను అమెరికా వెళ్లేందుకు గత రెండు సంవత్సరాలుగా యార్లగడ్డ చేస్తున్న ప్రయత్నాలకు అక్రమ కేసుల కారణం గా కోర్టులు అనుమతులు ఇవ్వలేదు. తాజాగా మచిలీపట్నం ఎస్సీ, ఎస్టీ జిల్లా కోర్టు పలు షరతులతో యార్లగడ్డ అమెరికా పర్యటనకు అనుమతులు మంజూరు చేసింది. నలుగురు వ్యక్తులు జామిను ఇవ్వటంతో పాటు, అమెరికా వెళ్ళిన తర్వాత ఏక్షణం ఎక్కడ ఉండేది వంటి అన్ని అంశాలతో పర్యటన పూర్తి వివరాలను అమెరికా వెళ్లక ముందే కోర్టుకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని ఆదేశించింది. ఇక్కడ నుంచి బయలుదేరిన తర్వాత సెల్ ఫోన్ ఎప్పుడు ఆన్ లోనే ఉండాలని, జులై 15వ తేదీ లోపు ఎట్టిపరిస్థితుల్లోను తిరిగి భారత్ కు వచ్చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కోర్టు ఇచ్చిన అనుమతులను పొడిగింపు కోరరాదని, అనుమతులోని షరతులను ఉల్లంఘించకూడదని ఆదేశిస్తూ విదేశీయనానికి అనుమతులు ఇచ్చింది. మన దేశానికి వచ్చిన తర్వాత వారం రోజుల్లోపు కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశిస్తూ అమెరికా పర్యటనకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విజయవాడ కోర్టు స్వల్ప షరతులతో యార్లగడ్డ విదేశీయానానికి అనుమతులు ఇవ్వగా బందరు కోర్టు మరిన్ని షరతులు విధించడం గమనార్హం. విదేశీ పర్యటన కు కోర్టుల నుంచి అనుమతులు రావడంతో ఈనెల చివరి వారం అమెరికా వెళ్ళేందుకు ఎమ్మెల్యే వెంకట్రావ్ సన్నాహాలు చేసుకుంటున్నారు.

## సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్ )లో కోరుకొండ శీలధి గ్లోబల్ స్కూల్ కి చెందిన విద్యార్థి గల్లా చెర్విన్ లారెన్స్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.): సైంటిఫిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(శాట్ ) లో కోరుకొండ శీలధి గ్లోబల్ స్కూల్ కి చెందిన 6వ తరగతి విద్యార్థి గల్లా చెర్విన్ లారెన్స్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాడు. గుంటూరులో ఆదివారం జరిగిన స్టేట్ లెవెల్ అవార్డుల ప్రధానోత్సవంలో చెర్విన్ ప్రముఖుల చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందుకున్నాడు. డైరెక్టర్ జి. లక్ష్మీ పద్మావతి ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. - శ్రీ షిరిడి సాయి కి స్టేట్ 3వ ర్యాంక్... కోరుకొండ శ్రీ షిరిడి సాయి స్కూల్ కి చెందిన 7వ తరగతి విద్యార్థి గొంతిన సత్య ప్రకాష్ శాట్ ఒలింపియాడ్ లో స్టేట్ 3 వ ర్యాంక్ సాధించాడు. గుంటూరు లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందుకున్నాడు. కరస్పాండెంట్ ఎస్. శ్యామలా శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

## నేడు గుడివాడ డీఎస్పీగా పాలా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ



గుడివాడ, ఏప్రిల్ 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడ డీఎస్పీగా పాల శ్రీనివాస్ ను నియమిస్తూ డీజీపీ డీజీపీ హరీష్ హరీష్ కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం విజయవాడ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తున్నారు. గతంలో గుడివాడ వన్ టౌన్, టూ టౌన్ కు ఎస్సై గా విధులు నిర్వహించారు. పట్టణంలో సీసీఎస్ సీఐగా పనిచేశారు. ఆయన సోమవారం డి. ఎస్. పి. గా విధుల్లో చేరనున్నారు.

# తూర్పు గోదావరి జిల్లాలో గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు శ్రీకారం

**- ఫేజ్ వన్ కింద రూ.9.55 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన : మంత్రి ఆనం రామనారాయణరెడ్డి**



ఏలూరు, నేటి శుభోదయ ::: ( మాధవరావు యెగినాటి, "నేటి శుభోదయ" ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల కో ఆర్డినేటర్) ::: గోదావరి పుష్కరాలు 2027 సందర్భంగా చేపట్టవలసిన పనులను ఈరోజు నుంచి ప్రారంభం చేసినట్లు రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం నగరంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఫేజ్ 1 కింద రూ.9.55 కోట్ల తో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులతో కలిసి శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో సంప్రదాయ రీతిలో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా పరిసర ప్రాంతాల ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణపై ఇప్పటివరకు మూడు రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక సమావేశం, 12 మంత్రులతో సబ్ కమిటీ సమావేశం, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మంత్రులు, సెక్రటరీలతో మరో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పుష్కరాల నిర్వహణలో విశేష అనుభవం కలిగిన నాయకుడని, ఆయన సారథ్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగు తున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలో రూ.9.55 కోట్ల వ్యయంతో 6 దేవాదాయ సంస్థల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని మంత్రి పేర్కొన్నారు. ఆలయాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో గుర్తించి అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లోని 43 దేవాలయాల అభివృద్ధి కోసం రూ.51.79 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచినట్లు వెల్లడించారు.పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు రానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాలు సమగ్రంగా కల్పించనున్నట్లు తెలిపారు. గోదావరి నది ప్రవహించే 212 కిలోమీటర్ల పరిధిలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో పుష్కర స్నానాలకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ఈ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 26 నుంచి జూలై 7 వ తేదీ గోదావరి పుష్కరాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. గోదావరి పుష్కరములు 2027 సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాలో దేవాదాయ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, ఫేజ్ .1 కింద రాజమహేంద్రవరం నగరంలో 6 దేవాదాయ సంస్థల నూతన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం (పిండప్రదాన భవనం)కు రూ.3 కోట్లు, శ్రీ రమ సత్యనారాయణ స్వామి దేవస్థానం ముఖ మండపం నిర్మాణానికి రూ.1 కోటి, రాజమండ్రి నూనేవర్తకుల అన్నదాన సమాజం అన్నదాన భవనానికి రూ.70 లక్షలు, రామలింగ చౌడేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.55 లక్షలు, గౌతమీ జీవకారుణ్య సంఘం భవనం నిర్మాణానికి రూ.2.80 కోట్లు, శ్రీ చందా సత్రం కళ్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పనులు పూర్తయిన తరువాత భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించబడటంతో పాటు పుష్కరాల సమయంలో యాత్రికులకు మరింత సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.ఈ సందర్భంగా రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి జిల్లా దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం దుశ్శలువాతో సన్మానించారు. దేవాదాయ, పర్యటక శాఖల సమన్వయంతో టెంపుల్ టూరిజం అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాల నేపథ్యంలో మంత్రి పర్యటన సంతోషదాయకమని పేర్కొన్నారు. స్థానిక దేవాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఫేజ్1 కింద రూ.9.55 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పారు.పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మహోత్సవమని పేర్కొన్నారు. యాత్రికులకు అన్ని విధాల సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు.

దేవాలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారా పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.ఎంఎల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి మంత్రి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ కె. రామచంద్ర మోహన్, ప్రాంతీయ జాయింట్ కమిషనర్ వి. త్రినాధరావు, రాష్ట్ర స్థపతి పి. పరమేశ్వరప్ప, కేఆర్ఆర్సి ఎస్డిసి కె. భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఎస్.ఈ. దుర్గేష్, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, జిల్లా దేవాదాయ అధికారి ఈ.వి. సుబ్బారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్, ఏఈ కళ్యాణ్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారులు విశ్వనాధ్ రాజు, లక్ష్మీబాయి, నాగేశ్వరరావు, తారకేశ్వరరావు, వి. శ్రీదేవి, రమేష్, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండగా సీఎం చంద్రబాబు

**-గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**

**-రూ.12.15లక్షల...సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ**



గుడివాడ ఏప్రిల్ 12( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) సీఎం రిలీఫ్ ఫండ్ నిధి.. కష్టాల్లో ఉన్న పేదలకు పెన్నిధి వంటిదని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. పేద ప్రజల కష్టాల్లో అండగా నిలుస్తున్న సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.గుడివాడ టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో నియోజకవర్గ పరిధిలోని 30బాధిత కుటుంబాలకు రూ.12.15లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే రాము పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యే రాము మరియు కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలో చెక్కులు రావడంతో లబ్ధిదారులు హార్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మీడియాతో మాట్లాడారు. ఆపద సమయంలో అత్యవసరంగా అప్పు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తుందన్నారు. గుడివాడ నియోజకవర్గంలో ఏ ఒక్కరు వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదని ఆశయంతో నా వంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం హయంలో నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు రూ.5.48కోట్ల సీఎం రిలీఫ్ అండ్ చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు.మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద ప్రజలకు అండగా నిలుస్తూ, వారి సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారని కొనియాడారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకుంటున్న ప్రతి ఒక్కరూ, కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించి, మద్దతుగా నిలవాలని



పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రవి వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, బిజెపి నాయకులు అంగడాల సతీష్, టిడిపి నాయకులు పిన్నమనేని బాబ్జి,పంద్రాజు సాంబయ్య, లింగం ప్రసాద్, గుడివాడ జోన్స్ దయానంద్,పులవర్తి డేవిడ్ బాబు , నేరుసు కాశి, లోయ విజయ్, వేశపోగు ఇమ్మానుయేలు, వంగపండు ఆదినారాయణ, కడియాల గణేష్ ,యార్లగడ్డ సుధారాణి, సిరిపురపు తులసీరాణి, గొర్ల శ్రీలక్ష్మి, షేక్ జానీ, రెడ్డి షణ్ముఖ,పోట్లూరి కృష్ణారావు, పెద్ది బోయిన లక్ష్మీ నరసింహారావు, నిరంజన్, షేక్ సర్కార్ ,ఏసుబాబు, రఫీ,దేవేంద్రుడు ,అంజిరెడ్డి, ఉబ్బల వెంకటేశ్వరరావు, బసవయ్య ,మాదాల సునీత,ప్రభాకర్ రెడ్డి, వల్లభనేని రంగబాబు, నవాబు,ఈశ్వరరావు, కాటూరి శివాజీ, తెలుగు యువత, తెలుగు మహిళా, బీసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## అయ్యప్ప స్వామి అన్న సేవా మండపానికి లంకిశెట్టి బాలాజీ లక్ష విరాళం




మచిలీపట్నం, ఏప్రిల్ 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )మచిలీపట్నం చెమ్మనిగిరిపేట శివాలయంలోని కొలువై ఉన్న బంగారు అయ్యప్ప స్వామి దేవస్థానం తరపున శివాలయం వెనకవైపు శ్రీ అయ్యప్ప స్వామి అన్న సేవ మండప నిర్మాణం శంకుస్థాపన ఆదివారం వేదమంత్రాలు మధ్య సేవ ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.శ్రీ అయ్యప్ప స్వామి అన్న సేవా ట్రస్ట్ సభ్యులు దేసు సత్య వెంకట రాంబాబు, దేసు సత్య వెంకట రమణమూర్తి, కొత్తగుండు శివప్రసాద్, నగరపు మల్లేశ్వరరావు, జొన్నలగడ్డ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ పూర్వ అర్చకులు మురళి స్వామి నేతృత్వంలో ఘనంగా శంకుస్థాపన జరిగింది . ఈ భవన నిర్మాణం కోసం మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, 15 డివిజన్ మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజ దంపతులు సేవా ట్రస్టుకు లక్ష రూపాయలు నగదు ను భవన నిర్మాణ నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అయ్యప్ప స్వామి అయ్యప్ప భక్తులు, మాదిరెడ్డి అంజిబాబు పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు. అయ్యప్ప దీక్షను పురస్కరించుకొని వచ్చే సంవత్సరం లక్ష మంది దీక్షాదారులైన అయ్యప్ప భక్తులకు అన్నప్రసాదం అన్న సేవ టెస్ట్ ద్వారా అందిస్తున్నారు.

## డాక్టర్ రమేష్ కృష్ణకు అభినందనల వెల్లువ

**-ఒంగోలులో ప్రముఖుల చేతుల మీదుగా నాలుగు పుస్తకాల ఆవిష్కరణ**



ఒంగోలు, ఏప్రిల్ 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రముఖ సాహిత్యవేత్త, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు, ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్, బహు గ్రంథకర్త, నాట్య కోవిదులు నృత్య శిక్షకులు డాక్టర్ రామచంద్రుని రమేష్ కృష్ణ రచించిన నాలుగు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఒంగోలు రాజీవ్ నగర్ లోని శ్రీ సత్య శ్రీనివాస సదన్ లో జాతీయ సాహిత్య సాంస్కృతిక సమితి, అవసర ట్రస్ట్ సంయుక్త నిర్వహణలో అభిమాన జన సందోహం నడుమ నేత్ర పర్వంగా ఘనంగా జరిగింది. డాక్టర్ రమేష్ కృష్ణ రచించిన శ్రీ ఆశ్చర్య రామాయణం (తెలుగు), బాలవాల్మీకిరామాయణ్ (హిందీ), బాలమహాభారత్ (హిందీ), బాలభాగవత్ (హిందీ), గ్రంథాలను ప్రముఖ హరికథా కళాకారిణి పద్మశ్రీ డి.ఉమామహేశ్వరి, కేంద్రసంగీతనాటక అకాడమీ పురస్కారగ్రహీత డాక్టర్ కళాకృష్ణ, ఆంధ్రసారస్వతపరిషత్ అధ్యక్షులు డాక్టర్ గజల్ శ్రీనివాస్, అవధానధుని, జాతీయ సాహిత్య పురస్కారగ్రహీత సురభి శంకరశర్మ, రాష్ట్రపతి బాదరాయణ సమ్మాన్ పురస్కార గ్రహీత డాక్టర్ అద్దంకి



శ్రీనివాస్,విశ్రాంత సంస్కృతోపన్యాసకులు కిడాంబి భక్తవత్సలం, డాక్టర్ మురళీధర్ రెడ్డి , డాక్టర్ భరత్ , డాక్టర్ రాజ్యలక్ష్మి, . శ్రీకాంత్, శకుంతల,.రాజేష్, జాతీయ సాహిత్య సాంస్కృతిక సమితి జిల్లా కన్వీనర్ ఎం వి ఎస్ శాస్త్రి తదితరులు గ్రంధావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరిన్ని పరిశోధనాత్మక గ్రంథాలు డాక్టర్ రమేష్ కృష్ణ చేతుల మీదుగా వెలువడాలని ఆకాంక్షించారు. డాక్టర్ రమేష్ కృష్ణకు వివిధ భాషలలో నాట్య రీతులలో గల విశేష ప్రజ్ఞను వక్తలు అభినందించారు. దేశంలోని అనేక ప్రాంతాల నుండి నుండి విచ్చేసిన అభిమానులు శిష్యులు సాహిత్య సంఘాల ప్రతినిధులు డాక్టర్ రమేష్ కృష్ణను ఘనంగా సన్మానించారు. తనకు జరిగిన సన్మానానికి డాక్టర్ రమేష్ కృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

## గాదరాడ, నర్సాపురం, కోరుకొండ, కాపవరం, మునగాల గ్రామాల్లో రైతు దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**- కోరుకొండ కో ఆపరేటివ్ చైర్మన్ బత్తుల గోపాలకృష్ణ సారధ్యంలో రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం..**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.); తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు కోరుకొండ కో ఆప్ రేటివ్ సొసైటీ పరిధిలో గల పలు గ్రామాలలో రైతు దాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు.కోరుకొండ కో ఆపరేటివ్ చైర్మన్ బత్తుల గోపాలకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని గాదరాడ, నర్సాపురం, కోరుకొండ, కాపవరం, మునగాల గ్రామాల్లో రైతు దాన్యం కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో తెచ్చారు. ఈ కార్యక్రమంలో ఏం సి డైరెక్టర్ ఎర్రంశెట్టి పోలారావు, సి.ఇ. ఓ. ఆకుల వెంకట రమణ, సుభాష్, డైరెక్టర్స్ కూటమి కూటమి నాయకులు పాల్గొన్నారు.




## పెదకాకాని దర్గా వ్యవస్థాపకులు సుభాని భార్య మృతి

### -ఈనెల 16,17,18 నా జరగాల్సిన గంధ మహోత్సవాలు వాయిదా

పెదకాకాని, ఏప్రిల్ 12 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) పెదకాకానిలో లో ఈనెల 16,17,18 తేదీలలో జరగాల్సిన హజరత్ కరిముల్లా బాబా గంధ మహోత్సవాలు వాయిదా వేసినట్టులిమ్రా యూత్ ఆర్గనైజేషన్ చైర్మన్ అసిఫ్ పాషా తెలిపారు. దర్గా వ్యవస్థాపకులు సుభాని సతీమణి మృతి చెందడం వలన వాయిదా జరిగిందన్నారు. ఈనెల 16 17 18 జరిగాల్సిన గంధ మహోత్సవం వాయిదా వేశామని తెలిపారు.

## డిజిటల్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



చింతూరు సిఐ గోపాలకృష్ణ చింతూరు డివిజన్ నేటి శుభోదయ: పోలీసువున్నతాధికారులైన జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, ఏ.ఎస్.పి హేమంత్ కుమార్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు సిఐ తెలిపారు. గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ మోసగాళ్లపట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం వీరాపురం, చిడుమురు గ్రామస్తులకు అవగాహన కల్పించారు.మొబైల్ వాడకం పెరిగిన ప్రతి మోసాలు పెరుగుతున్నాయని మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని కోరారు. మొబైల్ లో డిజిటల్ అరెస్ట్ చేసామని మొబైల్ వాడకం దారులకు అక్రమ కాల్స్ వస్తుంటాయని వెంటనే తమకు తెలపాలని కోరారు. అలాగే యువతను ఉద్దేశించి అవగాహన కల్పించారు. గంజాయి సేవించడం, అక్రమ రవాణా చేయటం, అక్రమ రవాణా చేసే వారికి సహకరించటం నేరమేనని, జైలు జీవితం గడపాల్సి వస్తుందని, గంజాయి వ్యాపారం ద్వారా సంపాదించిన ఆస్తులు ఎవరికన్నా ఉంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని పేర్కొన్నారు.. మహిళల భద్రత గూర్చి మాట్లాడుతూ మొబైల్ వాడకం పెరిగిన తర్వాత మహిళలను లొంగదీసుకోవటానికి, అనేక రకాలుగా మోసాలు జరుగుతున్నాయని వారిపట్ల అప్రమత్తమై పోలీసులకు వెంటనే సమాచారం ఇచ్చి తమను తాము రక్షించుకోవాలని వివరించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు తమ గ్రామాలకు వస్తే తమకు సమాచారం అందించాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరు పాటించాలని కోరారు. రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని యువత, వీరాపురం, చిడుమూరు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సిఐ గోపాలకృష్ణ, యస్ ఐ సంతోష్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## భద్రాచలం మాదే ఐదు పంచాయతీలు మావే

### - 5 పంచాయతీలను ఎట్టి పరిస్థితుల్లో వదులుకోము - ధారాదత్తం చేయడానికి తాము సిద్ధంగా లేము - భద్రాచలాన్ని ఏజెన్సీ జిల్లా కేంద్రంగా ప్రకటించాలి - కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలి




చింతూరు డివిజన్ నేటి శుభోదయ:తెలంగాణ రాష్ట్రం భద్రాద్రికొత్తగూడెం జిల్లా పరిధిలో ఉన్న భద్రాచలాన్ని ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసి ఏజెన్సీ ప్రాంత ఆదివాసీలకు జిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఆదివాసి అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎటపాక మండల పరిధిలోని గౌరీదేవిపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఏపీలో నూతనంగా ఏర్పాటైన ఎటపాక మండలంలోని 5 పంచాయతీలను తిరిగి భద్రాచలంలో కలపాలని నేడు కొందరు చేస్తున్న ప్రయత్నాలను వారు తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర విభజన జరిగి తాము పూర్తిగా నష్టపోయామని , ఇదే క్రమంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే తాము తల దాచుకునేందుకు సెంటు స్థలం కూడా లేదని , ఇటువంటి పరిస్థితుల్లో తాము కన్నాయిగూడెం , పిచుకలపాడు , ఎటపాక , పురుషోత్తపట్నం , గుండాల పంచాయతీలను ఎట్టి పరిస్థితుల్లో వదులుకోబోమని , 1953 సంవత్సరానికి పూర్వం భద్రాచలం తాలూకా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తూర్పుగోదావరి జిల్లాలో ఉండేదని , ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఆదివాసీలకు న్యాయం జరిగేలా కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని , తెలంగాణలో ఉన్న భద్రాచలాన్నే ఏజెన్సీ ప్రాంత ఆదివాసీల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలపాలని ఆదివాసి నాయకులు స్పష్టం చేశారు. ఇప్పుడిప్పుడే తమ ఆదివాసి గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని , అటువంటి సందర్భంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యక్తిగత ప్రయోజనాలు , స్వార్థం కోసమే ఈ 5 పంచాయతీల వివాదం తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. ఇటువంటి చర్యలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇకనైనా మానుకోవాలని , 5 పంచాయతీలను మీకు ధారాదత్తం చేయడానికి తాము సిద్ధంగా లేమంటూ , ఇక మీ ఆటలు చెల్లవు అని ఆదివాసీ నాయకులు హెచ్చరించారు. ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని , ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు , ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్తామని ఆదివాసి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు పూసం రాఘవయ్య , సున్నం బొజ్జయ్య , ఉలవల శివకనకరాజు , మడకం నరసింహారావు , తదితరులు పాల్గొన్నారు.

## కోరుకొండ నార్త్ జోన్ నూతన డీఎస్పీగా సిహెచ్. జీవన బాధ్యతలు స్వీకరణ

### - శాంతిభద్రతలు పరిరక్షణకు అందరు సహకారంతో కృషి చేస్తాం- డి.ఎస్.పి జీవన..




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ నార్త్ జోన్ డీఎస్పీగా సిహెచ్ జీవన ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. కోరుకొండలోని డిఎస్పీ కార్యాలయంలో ఆమె తన స్తానం ఆసీనులై కొత్త డిఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. డి.ఎస్.పి జీవన ముందుగా స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా




కోరుకొండ, రాజానగరం, సీతానగరం, గోకవరం పోలీస్ స్టేషన్ లకు సంబంధించిన ఎస్. ఐ. లు, పోలీసు సిబ్బంది డిఎస్పీ జీవనను మర్యాదపూర్వకంగా కలుసుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొత్త డిఎస్పి జీవన మాట్లాడుతూ.. శాంతిభద్రతలు పరిరక్షణకు అందరీ సహకారంతో కృషి చేస్తాం.. గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తామన్నారు..

# ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన శ్రీపాద

### శ్రీపాద ఆశయ సాధనలో తనయుల ప్రయాణం

### నేడు శ్రీపాదరావు 27వ వర్ధంతి



మంథని, ఏప్రిల్-12,నేటి శుభోదయ:ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో దివంగత శాసనసభాధిపతి దుద్దిళ్ళ శ్రీపాదరావు ప్రత్యేక స్థానం సంపాదించారు. ఆయన వ్యక్తిత్వమే ఆయనను ప్రజలకు దగ్గర చేసింది. ఇప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచేలా చేసింది. శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా మనందరం ఆయన సేవలను గుర్తుంచుకోవాలి. 13 ఏప్రిల్ 1999 న ఒక కార్యక్రమంలో పాల్గొని తిరిగి వస్తుండగా మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామ సమీపంలో ఆయనను నక్సలైట్లు అకారణంగా హతమార్చడం యావత్ రాష్ట్ర ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతి కి గురిచేసింది. కొందరు నాయకులు పదవుల వల్ల కాదు, తమ వ్యక్తిత్వం వల్ల గుర్తుండిపోతారు. వారు అందించిన విలువల వెలుగులు మాత్రం చిరస్థాయిగా నిలుస్థాయి. తెలుగు నేలపై అలాంటి వెలుగులు పంచిన నాయకుడు స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు. మార్చి 2, 1935న కాటారం మండలం ధన్వాడ గ్రామంలో జన్మించిన ఆయన సర్పంచ్ నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి వరకు ఎదిగారు. న్యాయవాదిగానూ సేవలందించారు. ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన శ్రీపాదరావు బాల్యమంతా పల్లెటూరులోనే గడిపారు. తల్లిదండ్రులు రాధాకృష్ణయ్య, కమలాబాయి విలువలతో కూడిన పెంపకం ఆయన ప్రజా ప్రస్థానానికి పునాదిరాళ్లయ్యాయి. చిన్నప్పటి నుంచి చదువులో చురుకుగా ఉండే ఆయన ధన్వాడలో ప్రాథమిక విద్య, మంథనిలో ఎస్ఎస్సీ పూర్తి చేశారు. ఉన్నత విద్య కోసం హైదరాబాద్ ఆ తర్వాత ఆదిలాబాద్‌లో పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. పంచాయతీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన అనుభవం ఆయనకు గ్రామ పరిపాలనపై స్పష్టమైన అవగాహన ఇచ్చింది. అనంతరం నాగ్‌పూర్‌లో న్యాయశాస్త్రం చదివి న్యాయవాదిగా సేవలందించారు.వ్యవసాయం చేస్తూ రాజకీయాల్లోకి తండ్రి మరణం తర్వాత శ్రీపాదరావు తన స్వగ్రామానికి తిరిగి వచ్చి వ్యవసాయం చేశారు. ఆ వ్యవసాయమే ఆయన జీవితాన్ని మలుపు తిప్పింది. రైతు కష్టాలు, పల్లె ప్రజల ఆవేదనలు ఆయనకు ప్రత్యక్ష అనుభవాలయ్యాయి. రాజకీయాల్లోకి రావడానికి ఆయనకు పెద్ద వేదికలు అవసరం కాలేదు. ప్రజలే ఆయనను ముందుకు నడిపించారు. వరుసగా రెండు సార్లు గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై, మహదేవపూర్ సమితి అధ్యక్షుడిగా, మంథని ల్యాండ్ మార్టేజ్ బ్యాంక్ ఛైర్మన్‌గా పనిచేశారు. ఈ దశలోనే ఆయన ప్రజానాయకుడిగా ఒక్కో మెట్టు పైకెదిగారు. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు దూరమయ్యే రాజకీయ సంస్కృతికి భిన్నంగా, ఆయన ఎప్పుడూ ప్రజల మధ్యే ఉండేవారు. నాయకత్వం అంటే హోదా కాదని, బాధ్యత అని ఆయన చెప్పేవారు. 1983లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం మధ్య కాంగ్రెస్ అభ్యర్థిగా మంథని నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ప్రజల విశ్వాసం ఆయనకు రాజకీయ బలాన్ని ఇచ్చింది. మూడు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా ఎన్నికై, మంథని నియోజకవర్గ అభివృద్ధికి నిబద్ధతతో కృషి చేశారు. రహదారులు, సాగునీటి సదుపాయాలు, విద్యా సంస్థలు, సంక్షేమ పథకాలు ఇలా ఆయన రాకతో మంథని రూపురేఖలు మారిపోయాయి. 1990-94 మధ్య ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం ఆయనకు లభించిన అత్యున్నత గౌరవం.స్పీకర్ పదవి అంటే కేవలం సభను నడపడం కాదు అందరికీ మాట్లాడే అవకాశం ఇచ్చేవారు. అది ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత. పొలిటికల్ హీట్ ఎక్కువగా ఉన్న కాలంలో కూడా ఆయన నిష్పక్షపాత వైఖరి పాటించారు. పార్టీ భావజాలాన్ని పక్కన పెట్టి, సభను సమతుల్యంగా నడిపి, అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల ప్రశంసలు పొందారు. శ్రీపాదరావు స్పీకర్‌గా ఉన్న కాలంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభలో సభ్యులు క్రమశిక్షణగా మెలిగేవారు. ప్రజలకు ఉపయోగపడే చర్చలన్నీ గౌరవప్రదంగా జరిగేలా చూసేవారు శ్రీపాద. సభాపతి పీఠం పట్ల ప్రజల్లో ఉన్న గౌరవాన్ని నిలబెట్టారు. అలాగే తన నియోజకవర్గాన్ని మరువలేదు. మంథని అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.నక్సలైట్ల చేతిలో 1994 ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజాసేవలో మాత్రం శ్రీపాదరావు వెనకడుగు వేయలేదు. నక్సలిజం ప్రభావం ఉన్న ప్రాంతంలోనూ ప్రజల మధ్యే తిరిగేవారు. హింసకు బదులుగా ప్రజాస్వామ్య మార్గాన్ని విశ్వసించారు. ప్రజల కోసం జీవించిన నాయకుడి జీవితం ఇలా బలవడం తెలంగాణ రాజకీయ చరిత్రలో విషాదం నింపింది. శ్రీపాద మరణానంతరం అవే విలువలతో రాజకీయాల్లో శ్రీధర్ బాబు తండ్రి ఆశయ సాధనకు త్రికరణ శుద్ధితో ప్రజా సేవలో ముందుకు వెళుతున్నారు. తండ్రి స్ఫూర్తితో ఆయన కుమారులు దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, శ్రీనుబాబులు ముందుకు తీసుకెళు_న్నారు. 1999 నుంచి శ్రీధర్ బాబు వరుసగా ఐదుసార్లు మంథని ఎమ్మెల్యేగా ఎన్నికై ప్రజల గుండెల్లో చెదరని ముద్ర వేసుకున్నారు. నేటి రాజకీయ వాతావరణంలో విభజన, విమర్శలు, ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్న వేళ, శ్రీపాదరావు జీవితం ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. అధికారాన్ని సంపాదించడం సులభమే కానీ, విశ్వాసాన్ని సంపాదించడం కష్టమని గ్రహించిన శ్రీధర్ బాబు తనపై కొందరు కావాలని పని కట్టుకొని చేస్తున్న విమర్శలపై ఏనాడు ఘాటుగా స్పందించక పోవడం ఆయన ఉన్నత వ్యక్తిత్వానికి నిదర్శనం.

# సామినేని హిమవంతరావు నిబద్దత , నిజాయితీ కలిగిన ఆదర్శ మూర్తి

### వారి ఆశయాలను, ఆలోచనలు ముందుకు తీసుకెళదాం

### రాష్ట్ర వ్యవసాయ శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు





ఖమ్మం, నేటి శుభోదయ ::: పిఆర్టియు ఖమ్మం జిల్లాశాఖ ఆధ్వర్యంలో జిల్లా సంఘ కార్యాలయం లో ఏర్పాటు చేసిన పిఆర్టియు సంఘ వ్యవస్థాపకులు సామినేని హిమంతరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన రాష్ట్ర మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు . పంచాయితీ రాజ్ ఉపాధ్యాయులు గర్వంగా తలెత్తుకొని తిరిగేలా చేసిన గొప్ప నాయకుడు . సామినేని హిమవంతరావు పిఆర్టియ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి అన్నారు . పిఆర్టియు సంఘ వ్యవస్థాపకులు సామినేని హిమవంతరావు విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు . ముందుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు . అనంతరం జిల్లా శాఖ అధ్యక్షులు కట్టా శేఖర్ రావు అధ్యక్షతన జరిగిన సభా కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరావు మాట్లాడుతూ సామినేని హిమవంత రావు తో గత నాలుగు దశాబ్దాల కాలంలో వారితో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు . సామినేని హిమవంత రావు నిబద్ధత నిజాయితీకి నిలువుటద్దమని ఈనాటి తరం వారి నుంచి ఎంతో నేర్చుకోవాల్సింది ఉందని పేర్కొన్నారు . నల్గొండ- ఖమ్మం - వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ పిఆర్టియు సంఘాన్ని స్థాపించి రాష్ట్రం లోని ఉపాధ్యాయ సంక్షేమానికి విద్యారంగ అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని శాసనమండలిలో తొలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పనిచేసి ఉపాధ్యాయులకు ఎన్నో రాయితీలు , ప్రయోజనాలు తీసుకొచ్చిన గొప్ప నాయకుడు అని పేర్కొన్నారు . వారి జీవితం మనందరికీ ఆదర్శమని సంఘస్థాపన నుండి పిఆర్టియు ఎదుగుదలకు అభివృద్ధికి ఎంతో కృషి చేసారని వారి కృషి ఫలితంగానే క్రమశిక్షణ విలువలతో కూడిన పెద్ద ఉపాధ్యాయ సంఘం గా పిఆర్టియు ఎదిగిందని పేర్కొన్నారు . రాష్ట్ర అధ్యక్షులు పులగం దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నడిబొడ్డున ఇంత పెద్ద సంఘ కార్యాలయాన్ని నిర్మించుకున్న పిఆర్టియు ఖమ్మం జిల్లా కుటుంబ సభ్యులందరికీ రాష్ట్ర శాఖ పక్షాన పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నామని సంఘ కార్యాలయానికి పెద్ద ఎత్తున విరాళాలు అందజేసిన సామినేని హిమవంతరావు కుమారులు రమేష్ కి వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకర బిక్షం గౌడ్ , ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు , నగర మేయర్ నీరజ , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ ,హిమవంత రావు , సమకాలీకులు ఉపాధ్యాయ మాస పత్రిక మాజీ ఎడిటర్ కొల్లు మధు సూదన్ రావు , కాంగ్రెస్ నాయకులు పువ్వాల్ల దుర్గా ప్రసాద్ , హిమవంత రావు , కుమారుదు రమేష్ , పిఆర్టియు జిల్లా ప్రధానకార్యదర్ది ఆర్ రంగారావు , మాజీ జిల్లా అధ్యక్షులు పి ఆర్ పి ఏ రాష్ట్ర అధ్యక్షులు మోత్కూరి మధు , ప్రధాన కార్యదర్శి కందుల వెంకట నర్సయ్య , పి ఆర్ పి ఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు , ఏఐఎఫ్టీవో ఉపాధ్యక్షులు చిత్తలూరి ప్రసాదరావు , మహబూబాబాద్ నల్గొండ , సూర్యాపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్ష , ప్రధాన కార్యదర్సులు , రాష్ట్ర , జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు , వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్సులు , కార్యకర్తలు హిమవంత రావు కుటుంబ సభ్యులు , బందు మిత్రులు పాల్గొన్నారు .

# ఇంటర్మీడియట్ ఫలితాల్లో డిఎంఏ హవా



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఇంటర్మీడియట్ ఫలితాల్లో డాక్టర్స్ మెడికల్ జూనియర్ కాలేజీ చెందిన విద్యార్థులు విజయ కేతనం ఎగుర వేశారు. బైపిసి ప్రధమ సంవత్సరం ఫలితాలలో అత్యధికంగా సుజల సాయి శ్రీ 438, మాన్వీ భూదాత 437, ఎన్ స్వాతి 437, ఎం దీప్తి 436, జి. లక్ష్మి తరుణి 434, కె.సాత్విక 433, కె. అశ్విత 433, బి. కీర్తి స్నేహా 432, పి.విద్యాభారతి 432, ఈ. పూజా 431, బి. జెస్విత 431, సిహెచ్. సింధూజా 430 వంటి అద్భుతమైన మార్యులు సాధించారు. అంతే కాకుండా మొత్తం 400 పైన 59 మంది విద్యార్థులు సాధించారు. కేవలం నీట్ కోచింగ్ కి డాక్టర్ మెడికల్ అకాడమీ డిఎన్ఏ నెట్ కోచింగ్ ని ఇస్తూ ఐపిఈ లో కూడా చివరి కొద్ది రోజుల్లో మాత్రమే ఐపిఈ కి కేటాయించి అత్యుత్తమ ఫలితాలు సాధించిందని, దీనికి కృషిచేసిన విద్యార్థిని, విద్యార్థులకు అధ్యాపకులకు ,తల్లిదండ్రులకీ, ఏర్పాటు చేసిన అభినందన సభలో అభినందనలు తెలిపారు. గత సంవత్సరం టి. వెన్నల తెలంగాణ రాష్ట్రం మొత్తం మీద నీట్ లో 3వ ర్యాంకు తెచ్చిన విషయం విధితమే అంతే కాకుండా ప్రతి సంవత్సరం నీట్లో 100 కు పైగా ఉచితం ఎంబిబిఎస్ సాధిస్తున్న ఏకైక విద్యా సంస్థ డిఎంఏ మాత్రమే. వారం రోజులు మాత్రమే ఇంటర్ సిలబస్కి ప్రిపేర్ అయి ఈ ఘనమైన ఫలితాలు సాధించడం హర్షదాయకం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను యాజమాన్యం, అధ్యాపక , అధ్యాపేకతర సిబ్బందిని అభినందించారు.

# ఇంటర్ పరీక్షా ఫలితాల్లో 'హార్వెస్ట్' విద్యార్థుల విజయ భేరి



ఖమ్మం, నేటి శుభోదయ ::: ఇంటర్ ప్రథమ , ద్వితీయ సంవత్సర పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థినీ విద్యార్థులు అగ్రశ్రేణి ఫలితాలు సాధించినట్లు 'హార్వెస్ట్' జూనియర్ కళాశాల విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికిగానూ తమ కళాశాల నుండి ప్రథమ సంవత్సర విద్యార్థులు 282 మంది , ద్వితీయ సంవత్సర విద్యార్థినీ విద్యార్థులు 129 మంది పరీక్షకు హాజరయ్యారన్నారుని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో తమ విద్యార్థి ఎం.పి.సి గ్రూపు నుండి బి. నీరజ్ 467, ఎస్.కె. లాల్బి 467, బి. సాత్వికప్రియ 466, ఎమ్.సాయిదుర్గ 466, ఎస్.కె. మనా తస్వీర్ 465, ఎ. అక్షయ్ 465, టి.బి. నరసింహ 465, బి. కార్తికారెడ్డి 464, ఒ. రిషిలక్ష్మణ్ 464, ఎమ్. రేవంత్ కుమార్ 464, ఎ. కుమార్ నాయక్ 464, టి. హారిక 464, కె. తనుష్క 464, మార్కులు సాధించినట్లు వారు వివరించారు. మొదటి సంవత్సరం ఎం.పి.సి గ్రూపులో గణితం 1ఎ లో 36 మంది, గణితం 1బిలో 55 మంది. భౌతిక శాస్త్రంలో 112. మంది, రసాయన శాస్త్రంలో - 75 మంది వందశాతం మార్కులు సాధించినట్లు వారు తెలిపారు.అదేవిధంగా తమ ద్వితీయ సంవత్సర విదార్థులు ఎం.పి.సి గ్రూపు నుండి కె. రుచిత 993 మార్కులు సాధించి కళాశాల అగ్రస్థానంలో నిలిచారన్నారు. ఎ. యామిని 992, ఎ.శ్రీకళ 991, జి.కౌసల్య 989, వి. కీర్తిరెడ్డి 988, జి.ప్రణతి 987, జి.శ్రావణ్ కుమార్ 986, ఎన్. సిరిసాన్వి 985, షేక్ మహబూబ్ పాషా 985, వై. యశ్వంత్ 984, పి.సంజయ్ రామస్వామి 984, జి.సమిత్ 982, జి. యశ్మిత 982, పి.కె. రాఘవ చౌదరి 982 మార్కులతో ఎం.పి.సి గ్రూపు నుండి అత్యున్నత మార్కులు సాధించినట్లు వారు వివరించారు. ద్వితీయ సంవత్సరం లో తమ విద్యార్థినీ, విద్యార్థులు గణితం 2ఎ లో 33 మంది, గణితం 20 లో 34 మంది, వందశాతం మార్కులు, భౌతిక శాస్త్రంలో 39 మంది వందశాతం మార్కులు, రసాయన శాస్త్రంలో - 33 మంది వందశాతం మార్కులు సాధించారన్నారు. తమ కళాశాల నుండి ఇంటర్ మొదటి సంవత్సరం ఎమ్.పి.సి గ్రూప్ నుండి పరీక్ష రాసిన విద్యార్థినీ విద్యార్థులలో 460 మార్కులకు పైగా సాధించినటువంటి వారు 27 మంది విద్యార్థినీ విద్యార్థులు, అదేవిధంగా ఇంటర్ రెండవ సంవత్సరం ఎమ్.పి.సి గ్రూప్ నుండి పరీక్ష రాసిన విద్యార్థినీ విద్యార్థులలో 900 మార్కులకు పైగా సాధించినటువంటి వారు 69 మంది విద్యార్థినీ విద్యార్థులు ఉండటం హర్షనీయమన్నారు.

ఆదివారం కళాశాల ఆవరణలో 'హార్వెస్ట్' గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్ , ప్రిన్సిపల్ ఆర్. పార్వతీరెడ్డి విద్యార్థిని, విద్యార్థులను అభినందించి, భవిష్యత్లో మరిన్ని విజయాలు సాదించాలని అభిలషించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్చార్జను, అధ్యాపక బృందాన్ని వారు అభినందించారు.

## ఇరాన్‌పై సైనిక చర్యలు కొనసాగుతాయి : నెతన్యాహు



అలెప్పో: ఇరాన్‌పై సైనిక చర్యలు కొనసాగుతాయని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు అన్నారు. ఇంకా చేయాల్సింది చాలా ఉందని నెతన్యాహు ఒక వీడియో సందేశంలో తెలిపారు. ప్రత్యక్ష శాంతి చర్చలు ప్రారంభించేందుకు లెబనాన్ ఇటీవలి వారాల్లో వివిధ పక్షాలతో సంప్రదింపులు జరిపిందని కూడా నెతన్యాహు వెల్లడించారు. పోరాటం ఇంకా ముగియలేదని బెంజమిన్ నెతన్యాహు శనివారం రాత్రి అన్నారు. "వారు మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేయాలనుకున్నారు, ఇప్పుడు మేము వారిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాము," అని ఇరాన్ మరియు దాని మిత్రదేశాల ప్రకటనలను ఉద్దేశిస్తూ నెతన్యాహు వ్యాఖ్యానించారు. ఇరాన్ వద్ద ఉన్న సుసంపన్నం చేసిన యురేనియంను తొలగించాలని కూడా నెతన్యాహు డిమాండ్ చేశారు. చర్చలకు ముందస్తు షరతుగా హిజ్బుల్లాను నిరాయుధపరచాలని, ఈ ఒప్పందం తరతరాలుగా నిలిచి ఉండే నిజమైన శాంతి ఒప్పందంగా ఉండాలని డిమాండ్ చేశారు.

## యుపిలో 2.04 కోట్ల ఓట్లు తొలగింపు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ (ఎస్ఐఆర్.2.0) ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితాల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్‌లో 2.04 కోట్ల పేర్లు తొలగించడంతో రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 13.39 కోట్లకు తగ్గింది. ఇది సవరింపు ప్రక్రియకు ముందు ఉన్న 15.44 కోట్లతో పోలిస్తే సుమారు 13.24% తగ్గుదలగా నమోదైంది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో జరిగిన ఎస్ఐఆర్ రెండో దశలో మొత్తం 5.38 కోట్లకు పైగా ఓటర్ల పేర్లు తొలగించబడ్డాయి. ఇది మొత్తం ఓటర్లలో 10.56% తగ్గుదలగా నిలిచింది. ఉత్తర ప్రదేశ్‌లోనే అత్యధికంగా 2.04 కోట్ల తొలగింపులు జరగగా, పశ్చిమ బెంగాల్‌లో సుమారు 91 లక్షల పేర్లు తొలగించబడ్డాయి. శాతం పరంగా చూస్తే అండమాన్ ఢ నికోబార్ దీవుల్లో 16.9% తగ్గుదలతో అగ్రస్థానం ఉండగా, ఉత్తర ప్రదేశ్ మరియు గుజరాత్ రాష్ట్రాల్లో సుమారు 13% తగ్గుదల నమోదైంది. ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో వరుసగా 12% మరియు 11.5% తొలగింపులు నమోదయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇది 11.7% కాగా, కేరళలో కేవలం 2.7% మాత్రమే తగ్గుదల కనిపించింది. ఎస్ఐఆర్ 2.0 ప్రకారం ఈ తొలగింపులకు ప్రధాన కారణాలుగా 1.46 కోట్ల మంది ఓటర్లు మరణించినట్లు గుర్తించడం, 4.6 కోట్లకు పైగా నివాసం మారడం, 44 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువ ప్రదేశాల్లో నమోదు కావడం వంటి అంశాలు పేర్కొన్నారు. తొలగింపుల్లో అధిక భాగం పట్టణ ప్రాంతాల్లోనే నమోదవగా, గైర్హాజరు, నివాసం మారిన, మరణించిన (ఎఎస్డీ) వర్గాలకు చెందినవారే ఎక్కువగా ఉన్నారు. ఉత్తర ప్రదేశ్ తుది జాబితాలో ప్రస్తుతం 13.39 కోట్ల మంది ఓటర్లు ఉండగా, అందులో 7.3 కోట్ల మంది పురుషులు, 6.09 కోట్ల మంది మహిళలు, 4,206 మంది తృతీయ లింగ ఓటర్లు ఉన్నారు. అలాగే 18--19 ఏళ్ల వయస్సు గల 17 లక్షల కొత్త ఓటర్లు జాబితాలో చేరారు. జనవరిలో విడుదలైన ముసాయిదా జాబితాలో 2.89 కోట్ల పేర్లు తొలగించడంతో భారీ తగ్గుదల కనిపించినప్పటికీ, ప్రజల అభ్యంతరాలు, ఫిర్యాదుల మేరకు 84.28 లక్షల పేర్లు తిరిగి చేర్చడంతో తుది తగ్గుదల కొంత తగ్గింది. అయితే సాంకేతిక సమస్యలు కూడా వెలుగుచూశాయి. సుమారు 1.04 కోట్ల మంది ఓటర్ల వివరాలు పాత జాబితాలతో సరిపోలకపోవడం, 2.22 కోట్ల కేసుల్లో పత్రాల తనిఖీలో తార్కిక వ్యత్యాసాలు గుర్తించడం జరిగింది. పశ్చిమ బెంగాల్‌లో 2002 నాటి జాబితాలతో అనుసంధానం లేకపోవడం వల్ల సుమారు 27 లక్షల మంది ఓటర్లు అగమ్యగోచరంగా ఉన్నారు. ఈ ప్రక్రియ దేశవ్యాప్తంగా వివాదాస్పదంగా మారింది. రెండో దశపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో మైక్రో అబ్జర్వర్లు, ధృవీకరణ ప్రక్రియలతో ఇది మరింత సంక్లిష్టమైంది. ఉత్తర ప్రదేశ్‌లో ప్రక్రియ పూర్తి చేయడంలో ఆలస్యం జరిగి, క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, విచారణలు పూర్తి కాకముందే గడువులు నాలుగు సార్లు పొడిగించాల్సి వచ్చింది. మొత్తం మీద, భారీ స్థాయిలో ఓటర్ల తొలగింపులు, సాంకేతిక లోపాలు, న్యాయపరమైన వివాదాలు ఎన్నికల ప్రక్రియపై చర్చలకు దారితీశాయి.

## బీజేపీ ఎంపీలకు 'త్రీ-లైన్' విప్ జారీ



ఢిల్లీ: ఏప్రిల్ 16, 17, 18 తేదీలలో మూడు రోజుల పాటు జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో బీజేపి (దీజ్రీ) తన ఎంపీలకు 'త్రీ-లైన్ విప్' జారీ చేసింది. ఈ సమావేశాల సమయంలో పార్టీ ఎంపీలందరూ తప్పనిసరిగా పార్లమెంట్‌కు హాజరుకావాలని ఆదేశించింది. ప్రభుత్వం కొన్ని కీలకమైన బిల్లులను ప్రవేశపెట్టి ఆమోదించుకునే అవకాశం ఉన్నందున, సభ్యులందరూ సభకు హాజరై ప్రభుత్వానికి మద్దతు తెలపాలని పార్టీ చీఫ్ విప్ స్పష్టం చేశారు. కేంద్ర మంత్రులతో సహా ఎంపీలందరూ ఈ మూడు రోజుల పాటు సభలోనే ఉండాలని.. ఈ సమయంలో ఎటువంటి సెలవులు మంజూరు చేయబడవని, హాజరు కచ్చితంగా ఉండాలని విప్ స్పష్టం చేసింది. ఈ ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లుపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించనుంది. ముఖ్యంగా, రిజర్వేషన్ల అమలు కాలపరిమితికి సంబంధించి కీలక సవరణలు చేసే యోచనలో ప్రభుత్వం ఉంది. 2023 నాటి 'నారీ శక్తి వందన్ అధినియం' ప్రకారం.. మహిళా రిజర్వేషన్లు తదుపరి జనాభా గణన మరియు నియోజకవర్గాల పునర్విభజన (డెలిమిటేషన్) తర్వాతే అమలు కావాల్సి ఉంది. అయితే, జనాభా గణనలో జాప్యం జరుగుతున్నందున 2011 జనాభా లెక్కల ఆధారంగానే ముందుకు వెళ్లాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, ప్రధాని మోదీకి ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాతే మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసమే బిల్లు తీసుకొస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై స్పష్టత లేకుండా, ఈ చారిత్రాత్మక చట్టంపై అర్థవంతమైన చర్చ జరపడం అసాధ్యమని ఖర్గే తన లేఖలో పేర్కొన్నారు.

## దిగ్గజ 'స్వరరాణి' ఆశా భోంస్లే మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



తాడేపల్లి: దిగ్గజ 'స్వరరాణి' ఆశా భోంస్లే మృతిపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆశా భోంస్లే బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆశా అద్భుతమైన కంఠం ప్రతి ఇంటిలోనూ ప్రతిధ్వనించాయి. ఆశా భోంస్లే కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి 'ఓం శాంతి!' అని పేర్కొన్నారు. ప్రముఖ గాయని ఆశా భోంస్లే (92) ఆదివారం కన్నుమూశారు. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. ఈ సందర్భంగా సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

# రూ.1,856 కోట్ల నిఘా డ్రోన్ కనిపించుట లేదు

## హార్మూజ్‌పై సీక్రెట్ ఆపరేషన్ సందర్భంగా అదృశ్యం అమెరికాకు మరో భారీ ఎదురుదెబ్బ



ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. నావికాదళానికి చెందిన అత్యంత ఖరీదైన నిఘా డ్రోన్‌ను అగ్రరాజ్యం కోల్పోయినట్టు సమాచారం. గురువారం హార్మూజ్ జలసంధి సమీపంలో గగనతలంలో సీక్రెట్ మిషన్ సందర్భంగా ఉదంతం చోటుచేసుకున్నట్టు తెలుస్తోంది. ఎంక్యూ--4సీ ట్రైటాన్‌గా పిలిచే ఈ డ్రోన్ ఖరీదు ఏకంగా 20 కోట్ల డాలర్లు (రూ.1,856 కోట్లు) కావడం గమనార్హం. రాడార్ల నుంచి హఠాత్తుగా అదృశ్యం కావడం సంచలనాత్మకంగా మారింది. ప్రస్తుతానికి కనిపించడం లేదు. ఎంక్యూ-4సీ ప్రమాదవశాత్తూ డ్రోన్ కూలిపోయిందా? లేక ఇరాన్ సైన్యం కూల్చివేసిందా? అనేది నిర్ధారణ కాలేదు. ఈ నిఘా డ్రోన్‌ను 2018లో అమెరికా సైన్యంలో ప్రవేశపెట్టారు. యుద్ధంలో కోల్పోవడం ఇదే మొదటిసారి. పశ్చిమాసియా యుద్ధంలో అమెరికా ఇప్పటికే భారీగా నష్టపోయింది. ఎఫ్--15ఇ, ఎ--10 వంటి ఆధునిక యుద్ధ విమానాలు నేలకూలాయి. ఎంక్యూ--4సీను



కోల్పోవడంతో ఆ నష్టం మరింత పెరుగుతోంది. తొమ్మిది ఎంక్యూ-- 9 రీపర్ డ్రోన్లను కూడా అమెరికా నష్టపోయింది. మొత్తానికి పశ్చిమాసియా యుద్ధం అమెరికాకు అత్యంత ఖరీదైన వ్యవహారంగా మారిపోయింది.

### డ్రోన్ నుంచి అత్యవసర సంకేతం

ఎంక్యూ-4సీ డ్రోన్ ఆచూకీ కోసం అమెరికా సైన్యం గాలిస్తున్నప్పటికీ ఆశించిన ఫలితం కనిపించడం లేదు. హార్మూజ్ జలసంధిపై మూడు గంటల మిషన్ తర్వాత ఈ డ్రోన్ ఇటలీ దేశం సిగోనెల్లాలోని తన స్థావరానికి తిరిగి వస్తుండగా కనిపించకుండా పోయింది. అదృశ్యమయ్యే ముందు అత్యంత వేగంగా కిందికి దిగినట్లు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా చూపుతోంది. కేవలం కొన్ని సెకండ్ల వ్యవధిలోనే 50 వేల అడుగుల ఎత్తు నుంచి 10 వేల అడుగుల ఎత్తుకు దిగినట్లు చెబుతోంది. అత్యంత అధునాతనమైన మానవరహిత నిఘా డ్రోన్లలో ఒకటైన ఎంక్యూ-4సీ ట్రైటాన్ తొలుత సౌదీ అరేబియా గగనతలంలోకి ప్రవేశించి ఆకస్మికంగా ఇరాన్ వైపు మళ్లింది. రాడార్ నుంచి అదృశ్యమయ్యే ముందు 7700 అనే కోడ్‌ను పంపించింది. ఇది ఒక అత్యవసర సంకేతం. అయితే, ఆ అత్యవసర పరిస్థితి ఏమిటన్నదానిపై ఎలాంటి సంకేతాలు ఇవ్వలేదు. అసలు హార్మూజ్ గగనతలంలోకి నిఘా డ్రోన్ ఎందుకు వెళ్లిందన్నది తెలియరాలేదు. పర్షియల్ గల్ఫ్ చుట్టుపక్కల పర్యవేక్షణ కోసం అమెరికా నావికాదళం గత నెల రోజులుగా ఎంక్యూ-4సీ ట్రైటాన్‌ను ఉపయోగిస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందానికి ఒకరోజు ముందు ఈ నెల 7వ తేదీన ఈ డ్రోన్ ఇరాన్‌లోని ఖర్గ్ ఐలాండ్‌పై చక్కర్లు కొట్టిందని చెబుతున్నారు. గతవారం ఎఫ్--15ఇ ఫైటర్ జెట్‌ను ఇరాన్ కూల్చివేసిన తర్వాత సహాయక చర్యల్లో డ్రోన్ పాలుపంచుకుంది. ఇది సాధారణ డ్రోన్ కాదు. సుదీర్ఘ కాలంపాటు సముద్ర నిఘా, పర్యవేక్షణ కోసం రూపొందించారు. 24 గంటలపాటు గాల్లో ఆగకుండా ఎగరగలదు. అమెరికా సైన్యానికి తురుపుముక్క లాంటి డ్రోన్ అదృశ్యం కావడం, ఇప్పటికీ ఆచూకీ లేకపోవడం మిస్టరీగా మారింది.

# బెంగాలీలను మైనార్టీలు కానివ్వం

**అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం**

**బుజ్జగింపు రాజకీయాలను అంతం చేస్తాం..**

**ఓటు బ్యాంకు రాజకీయాలను సహించే ప్రసక్తే లేదు**

**చొరబాటుదార్లు తట్టాబుట్టా సర్దుకొని వెళ్లిపోవాల్సిందే**

**ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ స్పష్టీకరణ**



జాంగీపూర్/కత్వా/కుష్మాండీ: పశ్చిమ బెంగాల్‌లో బుజ్జగింపు రాజకీయాలను అంతం చేస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రకటించారు. అధికారంలోకి వస్తే ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తామని, బెంగాల్ ప్రజలను సొంత రాష్ట్రంలో మైనార్టీలు కానివ్వబోమని తేల్చిచెప్పారు. శనివారం బెంగాల్‌లోని జాంగీపూర్, కత్వా, కుష్మాండీలో ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ అసెంబ్లీ ఎన్నికలను బెంగాల్ గుర్తింపు, భవిష్యత్తు పరిరక్షణ కోసం జరుగుతున్న యుద్ధంగా అభివర్ణించారు. అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని, చొరబాటుదార్లకు మద్దతు ఇస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే చొరబాటుదార్లను బయటకు పంపిస్తామని పునరుద్ఘాటించారు. జాతీయ భద్రతే తమకు ముఖ్యమని తేల్చిచెప్పారు. అక్రమ వలసల కారణంగా బెంగాల్‌లో చాలా ప్రాంతాల్లో జనాభా నిష్పత్తి మారిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. 'మా, మాటీ, మనుష్'నినాదాన్ని తృణమూల్ కాంగ్రెస్ వదిలేసిందని, అధికారం నిలబెట్టుకోవడానికి చొరబాటుదార్లపై ఆధారపడుతోందని ధ్వజమెత్తారు. వారి ఓట్లతో వారి కోసం ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నదే తృణమూల్ కాంగ్రెస్ ఉద్దేశమని విమర్శించారు. ఓటు బ్యాంకు రాజకీయాలను ఇకపై సహించే ప్రసక్తే లేదన్నారు. ప్రజలంతా ఏకమై ప్రభుత్వాన్ని మార్చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు వేసే ప్రతి ఓటు బీజేపీకి ఆశీర్వాదంగా మారాలని చెప్పారు. ప్రధానమంత్రి ప్రసంగం ఆయన మాటల్లోనే..

### కమ్యూనిస్టులకు కార్బన్ కాపీగా తృణమూల్

"బెంగాల్‌లో మార్పు తీసుకొస్తాం. రాష్ట్రాన్ని కాపాడుతాం. మార్పును ఎవరూ అడ్డుకోలేరు. బెంగాల్‌లో అహంకారం ప్రదర్శించిన ఎంతోమంది అడ్రస్ లేకుండాపోయారు. బ్రిటిష్ పాలకులతోపాటు కాంగ్రెస్, వామపక్షాలు గతంలో ఏమైందో చూశాం. ఇప్పుడు అదే పరిస్థితి తృణమూల్ కాంగ్రెస్‌కు ఎదురవుతుంది. బెంగాల్‌లో శ్రీరామనవమి వేడుకల్లో హింస జరిగితే మమతా బెనర్జీ ప్రభుత్వం నిందితులను కాపాడింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని తేలడంతో తృణమూల్ కాంగ్రెస్ నాయకులు అది సహించలేక తప్పుడు వీడియోలు, అబద్ధాలను పోస్టు చేస్తున్నారు. అస్సాం, పుదుచ్చేరిలోనూ ఇలాంటి కుతంత్రాలు సాగించారు. అబద్ధాలను నమ్మొద్దని ప్రజలను కోరుతున్నా. ఎన్నికల్లో ఉత్సాహంగా పాలుపంచుకోవాలి. బీజేపీని గెలిపించుకోవాలి. మా, మాటీ, మనుష్ నినాదంతో అధికారంలోకి వచ్చిన తృణమూల్ కాంగ్రెస్ చివరకు కమ్యూనిస్టు పార్టీలకు కార్బన్ కాపీగా మారిపోయింది. కమ్యూనిస్టు శక్తులు, సిండికేట్లు తృణమూల్ కాంగ్రెస్‌తో చేతులు కలిపాయి. కమ్యూనిస్టుల పాలనలో జరిగినట్లుగానే వేధింపులు, అరాచకాలు, అవినీతి అక్రమాలు కొనసాగుతున్నాయి. వామపక్ష కార్యకర్తలు ఓట్ల కోసం ప్రజలను బెదిరించేవారు. నేడు టీఎంసీ రౌడీలు సైతం అదే పని చేస్తున్నారు. అక్రమ ఆయుధా లు, డ్రగ్స్, పశువుల అక్రమ రవాణా, కట్ మనీ, కమీషన్లు.. ఇలా అన్నింటినీ తృణమూల్ కాంగ్రెస్ కాంట్రాక్టు తీసుకుంది. బీజేపీ అధికారంలోకి వచ్చాక అవినీతిపరులను కచ్చితంగా శిక్షిస్తాం. ప్రజలను వేధించినవారి కోసం జైలు తలుపులు తెరుచుకుంటాయి" అని అన్నారు.


### శరణార్థులకు భారత పౌరసత్వం

"బీజేపీ అధికారంలోకి రాగానే మతువా, నామశూద్ర వర్గాలతోపాటు ఇతర శరణార్థులకు సీఏఏ కింద భారత పౌరసత్వం కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తాం. చొరబాటుదార్లు తట్టాబుట్టా సర్దుకొని వెళ్లిపోవాల్సిందే. వారు వెనక్కి వెళ్లిపోవాల్సిన సమయం వచ్చింది. చొరబాటుదార్లను కాపాడేవారికి కూడా శిక్ష తప్పదు. బెంగాల్‌లో మా నినాదం సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ ఒక్కటే కాదు. మరొకటి కూడా ఉంది. అదే సబ్‌కా హిసాబ్. ప్రతి అరాచకవాదిని, అవినీతిపరుడిని శిక్షిస్తాం. శరణార్థులకు రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుంది. అలాగే బీజేపీ పాలనలో బెంగాల్‌ను ఉన్నత శిఖరాలకు చేరుస్తాం. ఓటింగ్‌లో మహిళల భాగస్వామ్యం అధికంగా ఉన్నచోట బీజేపీ విజయం సాధిస్తోంది. బెంగాల్‌లోనూ మహిళల ఓట్లతో అధికారంలోకి రాబోతున్నాం. ప్రజలంతా కలిసి తృణమూల్ కాంగ్రెస్ పాలనను అంతం చేయాలి. బీజేపీ పాలన వచ్చాక.. తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు, సిండికేట్ల అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తాం. చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. బెంగాల్‌లో అమలవుతున్న పథకాలను కొనసాగిస్తాం. వాటిని ఆపబోం"అని మోదీ స్పష్టం చేశారు.

### మహిళల భద్రతే మా ధ్యేయం

"మహిళల భద్రతకు బీజేపీ సర్కార్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుంది. తృణమూల్ కాంగ్రెస్ పాలనలో మహిళలపై లెక్కలేనన్ని నేరాలు జరిగాయి. వారిని దారుణంగా వేధించారు. మా ప్రభుత్వం వచ్చాక నేరగాళ్లను కఠినంగా శిక్షిస్తాం. పాత కేసులను మళ్లీ తెరుస్తాం. ఇది మోదీ గ్యారంటీ. మహిళల భద్రతే మా ధ్యేయం. తృణమూల్ ప్రభుత్వం ఫుట్‌బాల్ ఆటను కూడా సిండికేట్లకు అప్పగించింది. గత డిసెంబర్‌లో అర్జెంటీనా ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనెల్ మెస్సీ కోల్‌కతా పర్యటన సందర్భంగా గందరగోళం జరిగింది. ఆ సిగ్గుచేటైన చిత్రాలను ప్రపంచమంతా చూసింది. బెంగాల్‌లో ప్రభుత్వం అంటే సిండికేట్, సిండికేట్ అంటే ప్రభుత్వం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. చట్టవిరుద్ధమైన పాలనకు పర్యాయపదం తృణమూల్ సర్కార్. మమతా బెనర్జీ పార్టీకి సిద్ధాంతాలు, విలువలు లేవు. అందుకే అది ఇతర రాష్ట్రాల్లో అడుగుపెట్టలేకపోయింది"అని మోదీ అన్నారు.

# 'తొలగింపుల' జాతర!




పశ్చిమ బెంగాల్‌లో ఈ నెల 23న జరగబోయే తొలి దశ పోలింగ్‌కు సంబంధించి తాజాగా 27 లక్షల 17 వేలమంది ఓటర్లు జాబితాల నుంచి కనుమరుగైనట్టు సోమవారం అర్ధరాత్రి దాటాక ఎన్నికల సంఘం (ఈసీ) విడుదల చేసిన తుది జాబితా వెల్లడిస్తోంది. దీంతో ఇప్పటివరకూ జాబితాల్లో పేర్లు లేనివారి సంఖ్య దాదాపు 91 లక్షలకు చేరింది. రెండో దశకు సంబంధించి తొలగింపులు కూడా కలుపుకొంటే ఇది కోటికన్నా ఎక్కువే ఉండొచ్చు. న్యాయ నిర్ణయ పరిధి (అజ్యుడికేషన్) ప్రక్రియ గత నెలలో మొదలయ్యాక ఈసీ విడుదల చేసిన అనుబంధ జాబితా ఇది. సహజంగానే ముస్లిం మెజారిటీ ఉన్న ముర్షిదాబాద్‌లో అత్యధికుల పేర్లు తొలగించారు. అక్కడ అజ్యుడికేషన్ పరిధిలోకెళ్లిన 11,01,145 మందిలో 4,55,137 మంది అనర్హులుగా తేలారు. 'స్వచ్ఛమైన' జాబితాతోనే ఎన్నికలు నిర్వహించాలన్న దృఢ నిశ్చయంతోనే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)కు శ్రీకారం చుట్టామని బిహార్‌లో ఏరివేతలు మొదలెట్టినప్పుడే ఈసీ చెప్పింది. ఉద్దేశం మంచిదే కావొచ్చు. కానీ బిహార్ అనుభవం తర్వాతైనా ఆ ప్రక్రియకు పట్టే సమయంపై అంచనా ఉండాలి. అది లేకపోబట్టే లక్షలాదిమంది ఓటర్లు ఈసారి ఓటింగ్‌కు దూరం కాబోతున్నారు. వారి అప్పీళ్లపై ట్రిబ్యునళ్ల విచారణ జరుగు తోంది. వారిలో విశ్వసనీయమైన ఓటర్లుగా నిర్ధారణయ్యేవారు కూడా ఉండొచ్చు. కానీ 2031 అసెంబ్లీ ఎన్నికలకు తప్ప వారు ఓట్లేయటం సాధ్యపడదు. న్యాయ నిర్ణయ ప్రక్రియకు సమయం పడుతుంది గనుక అంతవరకూ ఓటర్ల జాబితాలను ఆపటం సాధ్యపడదని సోమవారం సుప్రీంకోర్టు చెప్పటంతో అలాంటి ఓటర్లకు ప్రస్తుతానికి తలుపులు మూసుకుపోయాయి. ఈ నెల 23న పోలింగ్ జరగబోయే 152 నియోజక వర్గాలకు సంబంధించిన ఓటర్ల తుది జాబితా సోమవారం విడుదలైంది. 29న రెండో దశలో 142 నియోజకవర్గాల్లో జరగబోయే పోలింగ్‌కు సంబంధించిన జాబితా బుధవారం అర్ధరాత్రి విడుదలవుతుంది. వ్యవధి తక్కువున్న తరుణంలో సుదీర్ఘ సమయం పట్టే ఇంత పెద్ద ప్రక్రియను ఒక అంచనా లేకుండా ఈసీ చేపట్టడాన్ని ధర్మాసనం తప్పుబట్టకపోవచ్చు గానీ, సాధారణ పౌరుల దృష్టిలో ఈసీది దోషమే అవుతుంది. ఎందుకంటే వారు బాధితులు. నిజానికి బిహార్ 'సర్' బెంగాల్‌తో పోలిస్తే ఎంతో మెరుగు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే తొలగింపులు పూర్తికావటం వల్ల ఫామ్--6 ద్వారా తిరిగి జాబితాలోకెక్కడానికి చాలామందికి అవకాశం వచ్చింది. బెంగాల్‌లో ఆ అదృష్టం దక్కలేదు. తమ పేరుందనుకునే లోగానే ఎవరో ఫామ్--7 కింద ఫిర్యాదు చేశారన్న కారణంతో ఓటర్లకు తాఖీదులు పోయాయి. పనులన్నీ మానుకుని కార్యాలయాల చుట్టూ తిరిగి అవసరమైన పత్రాలు తీసుకెళ్లినా సమస్య పరిష్కారం అనుమానమే. నిబంధనల ప్రకారం 2002 రికార్డులతో లింక్ లేని (అన్‌మ్యాప్డ్) సంగతి బయటపడినా, పేర్లలో అక్షర క్రమంలో స్వల్ప తేడాలొచ్చినా అనర్హులుగా జమవేయటం పెను సమస్యగా మారింది. తాజా జాబితాలో పేర్లు లేని వారిలో అనేకులు అడిగిన పత్రాలన్నీ ఇచ్చినా ఫలితం లేకపోయిందని బావురు మంటున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పెద్దయెత్తున అందజేసే ఫామ్--7 పత్రాలను తీసుకుని, వాటి ఆధారంగా తొలగింపులు చేపడుతున్నారన్న ఆరోపణలు వాస్తవం అనటానికి ఒక బీజేపీ నాయకురాలి పేరిట దాఖలైన ఫిర్యాదులే తార్కాణం. ఆ సంగతే తనకు తెలియదని ఆమె చెప్పటం గమనించదగ్గ అంశం. ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైనవారి సమస్య ఎన్నికల్లో ఓటేయలేకపోవటం మాత్రమే అయితే ఎవరూ పెద్దగా పట్టించుకునేవారు కాదు. రెండేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన దొంగ ఓటర్ల జాతర మాదిరి ఉదంతాల్లో తప్ప చాలా సందర్భాల్లో పోలింగ్ 65 శాతానికి మించదు. కానీ ఈ 'సర్' వల్ల గల్లంతైన వారికి భవిష్యత్తులో కష్టాలు చుట్టుముడతాయి. వారి పౌరసత్వమే సంశయాస్పదంగా మారి దేశం నుంచి గెంటేసే ప్రమాదం ఏర్పడుతుంది. బెంగాల్‌లో పార్టీల మధ్య ఉన్న కలహాలు సాధారణ ఓటర్ల భవితవ్యాన్ని అగమ్యగోచరం చేస్తున్నాయి. ఈసీ సక్రమంగా వ్యవహ రించివుంటే, ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఈ ప్రక్రియ పూర్తయ్యేలా ఏర్పాట్లు చేసుకుంటే సమస్యలు తలెత్తేవి కావు. ఆ సంస్థ చేతగానితనం సామాన్యుల బతుకుల్ని అయోమయంలోకి నెట్టింది.

# ‘విజయానికి వాళ్లే కారణం.. సంజూ కాదు’



ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ హ్యాట్రిక్ ఓటముల తర్వాత తొలి విజయాన్ని నమోదు చేసింది. మ్యాచ్ విజయంలో సంజూ శాంసన్, ఆయుశ్ మాత్రేలు కీలకపాత్ర పోషించారు. అయితే సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మాత్రం బౌలర్ల వల్లే తమ జట్టు విజయం సాధించిదంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం రుతురాజ్ మాట్లాడుతూ.. ‘ఎట్టకేలకు సీజన్‌లో తొలి విజయం సాధించడం, సంతోషంతో మాట్లాడేందుకు మీ ముందుకు రావడం జరిగింది. ఇవాళ మేము ఆడిన తీరు చాలా గొప్పగా అనిపించింది. చెపాక్ స్టేడియంలో మేము ఎప్పుడు మొదట బ్యాటింగ్ చేసినా 200 నుంచి 210 స్కోరు చేయాలని అనుకునేవాళ్లం. కానీ స్లో పిచ్ కారణంగా ఆ స్కోరు చేయడం కాస్త కష్టంగా అనిపించేంది. గత మ్యాచ్‌లతో పోలిస్తే అన్ని విషయాల్లో మెరుగయ్యాం. ఈరోజు సంజూ శాంసన్ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ప్రత్యర్థిపై విరుచుకుపడ్డాడు. ఆయుష్ కూడా అద్భుతంగా రాణించాడు. కానీ ఇవాళ బౌలింగ్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకోవాలి. కచ్చితంగా ఈరోజు మ్యాచ్ గెలుపులో బౌలింగ్ పాత్రే కీలకం. మిడిల్ ఓవర్లలో వికెట్లు తీయడం, ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయడం మా విజయానికి కలిసొచ్చింది. మా బౌలర్ల కృషిని చూసి గర్వపడుతున్నా. నిజానికి మా బౌలింగ్ లైనప్‌లో ‘ఎక్స్-ఫ్యాక్టర్’ బౌలర్ లేకపోయి ఉండవచ్చు. కానీ ప్రతి మ్యాచ్‌లోనూ ఎంత ప్రభావవంతంగా ఉండాలి, ముందస్తుగా ఎలా ఆలోచించాలి, అదనపు బౌండరీలను ఎలా ఆపాలి అనే విషయాలపై మేం చర్చించుకుంటూనే ఉన్నాం. తొలి మూడు మ్యాచ్‌ల్లో మేము విజయానికి చేరువగా వచ్చినప్పటికీ ఒకటి రెండు ఓవర్లలో 20-25 పరుగులు సమర్పించుకోవడం గెలుపును దూరం చేశాయి. పవర్‌ప్లేలో మేం కొంచెం వెనకంజలో నిలిచినప్పటికీ ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నాం. చెన్నై ఫ్యాన్స్ ఎప్పుడూ మాకు అండగా ఉంటారు. మేం ఎక్కడికి వెళ్లినా వారి మద్దతు, సందేశాలు మమ్మల్ని ఉత్సాహపరుస్తాయి. దేశంలో ఈ ప్రాంతం ప్రత్యేకం. ఇక్కడి ప్రజలు క్రికెట్‌ను ఆస్వాదిస్తూనే ఫ్రాంచైజీని అమితంగా ప్రేమిస్తుంటారు.’ అని చెప్పుకొచ్చాడు. మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. శాంసన్ సెంచరీ, శివమ్ దూబే అజేయ అర్థసెంచరీతో రాణించారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్ 20 ఓవర్లలో 189 పరుగులకు ఆలౌటైంది.

# పంజాబ్ ప్రతాపం

### భారీ స్కోర్ల మ్యాచ్‌లో సన్‌రైజర్స్ పరాజయం
### అదరగొట్టిన ప్రభ్‌సిమ్రన్, ప్రియాన్ష్ , శ్రేయస్ అయ్యర్
### అభిషేక్ శర్మ మెరుపులు వృథా



న్యూ చండీగఢ్: ఐపీఎల్ 19వ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ వరుసగా రెండో పరాజయం మూట గట్టుకుంది. బ్యాటింగ్‌లో ఆశించిన స్కోరు చేయలేకపోయిన రైజర్స్... పేలవ బౌలింగ్‌తో మూల్యం చెల్లించుకుంది. శనివారం ‘డబుల్ హెడర్’లో భాగంగా జరిగిన తొలి పోరులో సన్‌రైజర్స్ 6 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్ చేతిలో ఓడింది. మొదట హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 219 పరుగులు చేసింది. అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74; 5 ఫోర్లు, 8 సిక్స్‌లు) దంచికొట్టగా... ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్), క్లాసెన్ (33 బంతుల్లో 39; 1 ఫోర్, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. లక్ష్యఛేదనలో పంజాబ్ కింగ్స్ 18.5 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (20 బంతుల్లో 57; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), ప్రభ్‌సిమ్రన్ (25 బంతుల్లో 51; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుపు హాఫ్ సెంచరీలు సాధించగా... ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్; 5 ఫోర్లు, 5 సిక్స్‌లు) అజేయ అర్ధశతకంతో జట్టును గెలిపించాడు.

#### పవర్‌ప్లేలో 105 పరుగులు

రైజర్స్ ఇన్నింగ్స్ ప్రారంభమైన తీరు చూస్తే ఈ మ్యాచ్‌లో 300 పరుగుల రికార్డు స్కోరు ఖాయనిపించింది. తొలి రెండు ఓవర్లలో మూడు ఫోర్లు కొట్టిన అభిషేక్.. అర్ష్ దీప్ వేసిన మూడో ఓవర్‌లో 4, 4, 6, 6తో మొత్తం 24 పరుగులు రాబట్టాడు. యాన్సెన్ వేసిన తదుపరి ఓవర్‌లో హెడ్ 4, 6, 4 కొట్టగా... వైశాక్ వేసిన ఐదో ఓవర్‌లో అభిషేక్ నాలుగు సిక్స్‌లతో విజృంభించాడు. ఈ క్రమంలో అభిషేక్ 18 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. తదుపరి ఓవర్‌లో హెడ్ ‘హ్యాట్రిక్’ ఫోర్లు బాదగా... అభిషేక్ ఓ సిక్స్ కొట్టాడు. దీంతో ఆరు ఓవర్ల పవర్ ప్లే ముగిసేసరికి రైజర్స్ వికెట్ కోల్పోకుండా 105 పరుగులతో నిలిచింది. ఆ తర్వాత ఇన్నింగ్స్ గాడితప్పింది. శశాంక్ ఒకే ఓవర్‌లో హెడ్, అభిషేక్‌లను పెవిలియన్‌కు చేర్చగా... కెప్టెన్ ఇషాన్ కిషన్ (17 బంతుల్లో 27; 3 ఫోర్లు, 1 సిక్స్) ఓ మాదిరిగా ఆడినా... మరో ఎండ్‌లో క్లాసెన్ ధాటి కనబర్చలేకపోయాడు. అనికేత్ (18) అనూహ్యంగా రనౌట్ కాగా... నితీశ్ రెడ్డికి (0 నాటౌట్)ఒక్క బంతి మాత్రమే ఆడే అవకాశం దక్కింది. పవర్‌ప్లే తర్వాత 14 ఓవర్లలో హైదరాబాద్ 114 పరుగులే చేసి 6 వికెట్లు కోల్పోయింది.

#### ధనాధన్ ఆరంభం

సన్‌రైజర్స్ ఓపెనర్లను మరిపించే స్థాయిలో పంజాబ్ ఇన్నింగ్స్ ఆరంభమైంది. ప్రియాన్ష్ ఆర్య, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ప్రతి బంతిని బాదడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపించారు. ఆర్య తొలి ఓవర్‌లో 4, 6, 4 కొట్టగా... తర్వాతి రెండు ఓవర్‌లలో ప్రభ్‌సిమ్రన్ రెండేసి ఫోర్లు, రెండేసి సిక్స్‌లు బాదాడు. ఈ జంట ఏ బౌలర్‌ను వదలకుండా విరుచుకుపడటంతో... పవర్‌ప్లే ముగిసేసరికి పంజాబ్ వికెట్ కోల్పోకుండా 93 పరుగులు చేసింది. ఈ క్రమంలో హర్షల్ పటేల్ ఓవర్‌లో వరుసగా 6, 6, 4, 4 కొట్టిన ఆర్య 16 బంతుల్లోనే హాఫ్‌సెంచరీ పూర్తి చేసుకున్నాడు. కాసేపటికి ప్రభ్‌సిమ్రన్ 24 బంతుల్లో ఈ ఫీట్ అందుకున్నాడు. వీరిద్దరు అవుటయ్యాక ఇన్నింగ్స్‌ను నడిపించే బాధ్యత శ్రేయస్ తీసుకున్నాడు. ఆచితూచి ఆడుతూ ముందుకు సాగిన అయ్యర్ 24 బంతుల్లో ‘ఫిఫ్టీ’ కొట్టడంతో పాటు జట్టును విజయతీరాలకు చేర్చాడు.

#### స్కోరు వివరాలు

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి) అర్ష్ దీప్ (బి) శశాంక్ 74; హెడ్ (సి) బార్ట్‌లెట్ (బి) శశాంక్ 38; ఇషాన్ (సి) యాన్సెన్ (బి) అర్ష్ దీప్ 27; క్లాసెన్ (సి) కూపర్ (బి) బార్ట్‌లెట్ 39; అనికేత్ (రనౌట్) 18; సలీల్ (సి) బార్ట్‌లెట్ (బి) అర్ష్ దీప్ 9; నితీశ్ రెడ్డి (నాటౌట్) 0; హర్ష్ దూబే (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 13; మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 219.

వికెట్ల పతనం: 1-120, 2-122, 3-169, 4-195, 5-214, 6-218.

బౌలింగ్: అర్ష్ దీప్ 4-0-50-2; బార్ట్‌లెట్ 4-0-42-1; యాన్సెన్ 4-0-40-0; వైశాక్ 2-0-33-0; శశాంక్ 3-0-20-2; చాహల్ 3-0-33-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ఆర్య (సి) నితీశ్ రెడ్డి (బి) శివాంగ్ 57; ప్రభ్‌సిమ్రన్ (సి) క్లాసెన్ (బి) శివాంగ్ 51; కూపర్ (సి) అభిషేక్ (బి) శివాంగ్ 11; శ్రేయస్ అయ్యర్ (నాటౌట్) 69; నేహల్ వధేరా (బి) హర్ష్ 14; శశాంక్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (18.5 ఓవర్లలో 4 వికెట్లకు) 223.

వికెట్ల పతనం: 1-99, 2-117, 3-128, 4-197.

బౌలింగ్: హర్ష్ దూబే 4-0- 38-1; జైదేవ్ ఉనాద్కట్ 3-0-40-0; ఇషాన్ మలింగ 3--0--46--0; హర్షల్ 2-0-39-0; శివాంగ్ కుమార్ 4-0-33-3; నితీశ్ రెడ్డి 2-0-20-0; అభిషేక్ 0.5-0-7-0.

# వేసవిలో దేశంలోని పలు రాష్ట్రాల్లో చాలా మంది తాగే సహజసిద్ధమైన పానీయాలు ఇవి.. ఎలా తయారు చేయాలంటే..?

వేసవి తీవ్రత పెరిగినప్పుడల్లా వేసవి పానీయాలను గుర్తు చేసుకుంటారు. చల్లదనం కోసం ఐస్ లాటేలు, కృత్రిమ రంగులతో ఉన్న సోడా డ్రింక్స్ కాదు, నేల నుంచే వచ్చిన సహజ పానీయాలే ఉత్తమం. పచ్చి మామిడి, పుదీనా కలిపిన పానీయం నుంచి జీలకర్ర, కరివేపాకుతో చేసిన మజ్జిగ వరకు.. ప్రతి ప్రాంతానికీ ప్రత్యేకమైన వేసవి పానీయాలు ఉన్నాయి. ఇవి ఆయుర్వేద సూత్రాలపై ఆధారపడి, స్థానిక వాతావరణానికి అనుగుణంగా రూపుదిద్దుకుని తరతరాలుగా లభిస్తున్నాయి. దేశంలో వేసవి కాలంలో ఎక్కువగా తయారు చేసే అత్యంత ప్రాచుర్యం పొందిన కొన్ని వేసవి పానీయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ఆమ్ పన్నా, జల్జీరా, ఠండాయి..

ఆమ్ పన్నాను ఉత్తర భారత్ లో ఎక్కువగా తయారు చేస్తారు. పచ్చి మామిడితో చేసే ఈ పానీయం వేసవిలో అత్యంత ప్రాచుర్యం పొందింది. ఇది పుల్లగా, చల్లగా ఉండి శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ ను అందిస్తుంది. ఎండ దెబ్బ నుంచి రక్షణ కలిగించడంలో ఇది సహాయపడుతుంది. జల్జీరాను రాజస్థాన్, ఉత్తర భారత్ లో ఎక్కువగా తయారు చేస్తారు. జీలకర్ర, చింతపండు, పుదీనా కలిపి తయారు చేసే ఈ పానీయం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. భోజనం ముందు తాగితే ఆకలి పెరుగుతుంది, వేసవిలో శరీరానికి చల్లదనం ఇస్తుంది. అలాగే రాజస్థాన్, యూపీల్లో ఠండాయిని ఎక్కువగా తయారు చేస్తారు. పాలు, బాదం, సుగంధ ద్రవ్యాలతో తయారయ్యే ఠండాయి శరీరానికి చల్లదనం ఇవ్వడమే కాకుండా పోషకాలను కూడా అందిస్తుంది. ముఖ్యంగా పండుగల సమయంలో ఎక్కువగా తీసుకుంటారు.

సత్తు షర్బత్, కోకమ్ షర్బత్, మజ్జిగ..



సత్తు షర్బత్ బిహార్, యూపీల్లో ఎక్కువగా తయారు చేసే పానీయం. సత్తు (వేపిన శనగ పిండి)తో చేసే ఈ పానీయం ప్రోటీన్, ఫైబర్ అధికంగా కలిగి ఉంటుంది. ఇది శరీరాన్ని చల్లగా ఉంచి, ఎక్కువసేపు ఆకలి లేకుండా ఉంచుతుంది. అదే విధంగా మహారాష్ట్ర, గోవాల్లో కోకమ్ షర్బత్ ను ఎక్కువగా తయారు చేస్తారు. కోకమ్ పండుతో చేసే ఈ పానీయం గులాబీ రంగులో ఉండి, జీర్ణాశయంలో వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది. జీర్ణక్రియకు కూడా మంచిది. ఇక దేశవ్యాప్తంగా చేసే పానీయాల్లో మజ్జిగ / చాస్ ఒకటి. మజ్జిగ భారతదేశంలో ప్రతి ప్రాంతంలో కనిపించే సాధారణ పానీయం. ఇది ప్రోబయోటిక్ గుణాలు కలిగి ఉండి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. జీలకర్ర, అల్లం వంటి పదార్థాలతో కలిపితే ఇంకా ప్రయోజనకరంగా ఉంటుంది.

బేల్ షర్బత్, నన్నారి షర్బత్, సోల్కఢీనీ..


వేసవిలో ఎక్కువగా తయారు చేసే పానీయాల్లో బేల్ షర్బత్ కూడా ఒకటి. దీనిని తూర్పు భారత్ లో ఎక్కువగా తయారు చేస్తూ ఉంటారు. బేల్ పండుతో చేసే ఈ పానీయం సహజంగా తీపిగా ఉండి శరీరాన్ని చల్లబరుస్తుంది. వేసవిలో ఇది శక్తినిస్తుంది. నన్నారి షర్బత్ ను దక్షిణ భారత్ లో తయారు చేస్తూ ఉంటారు. నన్నారి వేరు నుంచి తయారయ్యే ఈ పానీయం శరీరానికి చల్లదనం ఇచ్చి, చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. కొంకణ్ ప్రాంతంలో సోల్కఢీనీ ఎక్కువగా తయారు చేస్తారు. కొబ్బరి పాలు, కోకమ్ కలిపి చేసే ఈ పానీయాన్ని భోజనం తర్వాత తీసుకుంటే జీర్ణక్రియకు సహాయపడుతుంది. శరీరానికి తక్షణ చల్లదనం ఇస్తుంది. నుంగు షర్బత్ ను తమిళనాడు, కేరళలో తయారు చేస్తూ ఉంటారు. తాటి ముంజలు (ఐస్ ఆపిల్)తో చేసే ఈ పానీయం సహజంగా తీపిగా ఉండి వేసవిలో శరీరాన్ని చల్లగా ఉంచుతుంది. ఇలా దేశంలోని ఈ సంప్రదాయ వేసవి పానీయాలు కేవలం దాహం తీర్చడానికే కాదు, శరీరాన్ని లోపల నుంచి చల్లబరచడానికి కూడా ఉపయోగపడతాయి. ప్రాసెస్డ్ డ్రింక్స్ కంటే ఇవి ఆరోగ్యకరమైన ఎంపికలు. ఎండ ఎక్కువగా అనిపించినప్పుడు ఈ సహజ పానీయాలను తాగడం మంచిది.

# ఏయే డ్రైఫ్రూట్స్‌ను అసలు రోజులో ఏ సమయంలో తీసుకుంటే మేలు చేస్తాయి..?

డ్రైఫ్రూట్స్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని సాధారణంగా భావిస్తారు. వీటిలో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రోటీన్, ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. క్రమం తప్పకుండా వీటిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడటం, కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉండటం, రోజంతా శక్తి నిల్వ ఉండటం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. అయితే డ్రైఫ్రూట్స్‌ను ఎప్పుడు తింటామనే విషయం కూడా వాటి ప్రయోజనాలపై ప్రభావం చూపుతుందని, డ్రైఫ్రూట్స్‌ను సరైన సమయంలో తీసుకోవడం వల్ల శరీరానికి ఎక్కువ ప్రయోజనం అందుతుందని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ ను ఏయే సమయంలో తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం.

#### బాదంపప్పు, జీడిపప్పు..

ముందుగా బాదం గురించి చెప్పాలంటే, ఉదయం ఖాళీ కడుపుతో తినడం ఉత్తమ సమయంగా నిపుణులు సూచించారు. నానబెట్టిన బాదం తింటే మెటాబాలిజం వేగం పెరుగుతుంది. ఇవి శరీరానికి స్థిరమైన శక్తిని అందించడంతో పాటు ఏకాగ్రతను మెరుగుపరుస్తాయి. అలాగే ఎక్కువసేపు ఆకలి లేకుండా ఉంచుతాయి. వాల్‌నట్స్‌ను సాయంత్రం సమయంలో తినడం మంచిది. ఇవి పోషకాలు శరీరంలో సులభంగా శోషించేందుకు సహాయపడతాయి. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు, మెలటోనిన్ కలిగి ఉండటం వల్ల మెదడు పనితీరును మెరుగుపరచడంతోపాటు నిద్ర నాణ్యతను పెంచుతాయి. జీడిపప్పును మధ్యాహ్నం స్నాక్‌గా తీసుకోవడం ఉత్తమం. ఇవి మెగ్నీషియం, మంచి కొవ్వులు కలిగి ఉండి శరీరానికి దీర్ఘకాలిక శక్తిని అందిస్తాయి. అయితే రాత్రి సమయంలో వీటిని తినడం మంచిది కాదని, అధిక కొవ్వు, ప్రోటీన్ ఉండటం వల్ల జీర్ణక్రియ నెమ్మదించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



#### పిస్తా..

ఇక పిస్తా విషయానికి వస్తే, ఆరోగ్య లక్ష్యాలపై ఆధారపడి వీటిని తీసుకునే సమయం మారవచ్చు. సాధారణంగా పగటి సమయంలో స్నాక్‌గా తీసుకోవడం మంచిది. ఇవి ప్రోటీన్, ఫైబర్ సమృద్ధిగా ఉండి శక్తిని నిల్వ ఉంచడంలో సహాయపడతాయి.సరైన డ్రైఫ్రూట్స్‌ను సరైన సమయంలో తీసుకోవడం వల్ల శరీరానికి అనేక లాభాలు కలుగుతాయి. శక్తి స్థాయిలు మెరుగుపడటం, జీర్ణక్రియ బాగుపడటం, అవసరం లేని ఆకలి తగ్గడం, నిద్ర నాణ్యత పెరగడం, రోజంతా సమతుల్యమైన ఆహారపు అలవాట్లు ఏర్పడడం వంటి ప్రయోజనాలు అందుతాయి. ఆరోగ్యకరమైన ఆహారం అంటే ఏం తింటామన్నది మాత్రమే కాదు, ఎప్పుడు తింటామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. చిన్న మార్పులు చేస్తే శరీరం ఇచ్చే ఫలితాల్లో పెద్ద తేడా కనిపిస్తుందని వారు సూచిస్తున్నారు.

# రఫేల్ డీల్.. ‘స్వదేశీ’ అస్త్రాలకు పెద్దపీట!



భారత వాయుసేన(ఐఏఎఫ్)లో సుమారు రూ.3.25 లక్షల కోట్ల వ్యయంతో కొనుగోలు చేయనున్న 114 రఫేల్ మల్టీ-రోల్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎంఆర్ఎఫ్ఏ) ఒప్పందంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిబంధనను చేర్చబోతోంది. ఈ యుద్ధ విమానాల్లో భారతీయ క్షిపణులు, ఆయుధ వ్యవస్థలను ఏకీకృతం చేసేందుకు వీలుగా ‘ఇంటర్‌ఫేస్ కంట్రోల్ డాక్యుమెంట్’ (ఐసీడీ)ను ఒప్పందంలో అంతర్భాగం చేయాలని భారత్ నిర్ణయించుకుంది.

ఏమిటీ ఐసీడీ? దీని ప్రాముఖ్యత ఏంటి?

సాధారణంగా ఏ దేశమైనా ఇతర దేశాల నుంచి యుద్ధ విమానాలను కొనుగోలు చేసినప్పుడు ఆ విమానాల తయారీ సంస్థలు తమ సొంత క్షిపణులను మాత్రమే వాడుకునేలా సాఫ్ట్‌వేర్ కట్టడి చేస్తాయి. అయితే, రాబోయే 114 రాఫెల్ విమానాల విషయంలో భారత్ భిన్నమైన వ్యూహాన్ని అనుసరిస్తోంది. తుది ఒప్పందంలో ఐసీడీలో మార్పులు చేయడంతో భారత రక్షణ పరిశోధన సంస్థ (డీఆర్‌డీఓ) అభివృద్ధి చేసిన అత్యాధునిక క్షిపణులు రఫేల్ వ్యవస్థతో అనుసంధానం కావడానికి మార్గం సుగమం అవుతుంది. దీనివల్ల భవిష్యత్తులో మనం ఫ్రాన్స్ నుంచి ఖరీదైన క్షిపణులను కొనాల్సిన అవసరం లేకుండా దేశీయ టెక్నాలజీతో గాలిలో నుంచి గాలిలోకి ప్రయోగించే క్షిపణులను, ఇతర స్వదేశీ బాంబులను ఈ విమానాల ద్వారా ప్రయోగించవచ్చు.

మేక్ ఇన్ ఇండియాకు ఊతం

ఫిబ్రవరి 12న డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ (డీఏసీ) ఈ భారీ ప్రతిపాదనకు ఆమోదముద్ర వేసింది. వచ్చే నెలలో డసో ఏవియేషన్ సంస్థకు ‘రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్’ (ఆర్ఎఫ్‌పీ) జారీ కానుంది. మొత్తం 114 విమానాలలో 18 విమానాలు నేరుగా ఫ్రాన్స్ నుంచి సిద్ధంగా వస్తాయి. మిగిలిన 96 విమానాలు 25 శాతం స్వదేశీ పరిజ్ఞానంతో భారత్‌లోనే తయారవుతాయి. ఇది దేశీయ రక్షణ రంగ తయారీలో ఒక కీలక మైలురాయిగా నిలవనుంది.

సోర్స్ కోడ్ వివాదంపై స్పష్టత

సోర్స్ కోడ్ బదిలీ విషయంలో వస్తున్న అపోహలను రక్షణ మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు కొట్టిపారేశారు. ఏవియానిక్స్, రాడార్, ఫ్లైట్ కంట్రోల్ వంటి కీలక విధులను నియంత్రించే సోర్స్ కోడ్‌ను పంచుకోకపోవడం అంతర్జాతీయ రక్షణ రంగంలో ఒక ప్రామాణిక పద్ధతి. భారత్‌కు అత్యంత సన్నిహిత దేశాలైన రష్యా (Su-30 MKI విషయంలో), అమెరికా కూడా తమ సోర్స్ కోడ్‌లను ఎవరికీ పంచుకోవు. అయినప్పటికీ, ఐసీడీ ద్వారా సాఫ్ట్‌వేర్ అనుసంధానత లభిస్తుంది కాబట్టి, సోర్స్ కోడ్ లేకపోయినా మన ఆయుధాలను వాడుకోవడానికి ఎటువంటి ఆటంకం ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# టెక్ స్టార్టప్‌ల్లోకి పెట్టుబడులు తగ్గాయ్..




న్యూఢిల్లీ: దేశీ టెక్నాలజీ అంకుర సంస్థల నిధుల సమీకరణ గత ఆర్థిక సంవత్సరంలో 11.7 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నమోదైన 14.3 బిలియన్ డాలర్లతో పోలిస్తే 18 శాతం క్షీణించింది. అయితే, 2023--24లో సమీకరించిన 9.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే పెరిగింది. మార్కెట్ ఇంటెలిజెన్స్ సంస్థ ’ట్రాక్షన్’ ఇండియా టెక్ వార్షిక ఫండింగ్ నివేదికలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం 2025--26 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా నిధులను దక్కించుకున్న స్టార్టప్‌లపరంగా అంతర్జాతీయంగా అమెరికా, బ్రిటన్, చైనా తర్వాత భారత్ నాలుగో స్థానంలో నిల్చింది. జర్మనీ, ఫ్రాన్స్‌కన్నా ముందుంది. తాజా గణాంకాల ప్రకారం సీడ్ స్థాయి స్టార్టప్‌లలో పెట్టుబడులు 1.5 బిలియన్ డాలర్ల నుంచి 15 శాతం క్షీణించి 1.3 బిలియన్ డాలర్లకు తగ్గాయి. వ్యాపారాలను విస్తరించే ప్రణాళికల్లో ఉన్న ఎర్లీ స్టేజ్ అంకురాల్లోకి ఫండింగ్ 3.6 బిలియన్ డాలర్ల నుంచి 33 శాతం ఎగిసి 4.8 డాలర్లకు పెరిగింది. లేట్ స్టేజ్ స్టార్టప్‌లకు నిధులు 9.2 బిలియన్ డాలర్ల నుంచి 38 శాతం క్షీణించి 5.6 బిలియన్ డాలర్లకు పడిపోయాయి.

#### నివేదికలో మరిన్ని వివరాలు..

2025--26లో 100 మిలియన్ డాలర్ల పైబడిన ఫండింగ్ లావాదేవీలు 13 నమోదయ్యాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో ఇవి 23గా, 2023--24లో 13గా నమోదయ్యాయి. నిధులను ఆకర్షించడంలో ఫిన్‌టెక్, రిటైల్ టాప్ రంగాలుగా నిల్చాయి. ప్రధానంగా ఎంటర్‌ప్రైజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్, ఫిన్‌టెక్ కంపెనీలకు భారీ స్థాయిలో నిధులను లభించాయి. నెక్స్‌ట్రాలోకి 710 మిలియన్ డాలర్ల పీఈ పెట్టుబడులు, నెయిసాలోకి 600 మిలియన్ డాలర్లు, ఐనాక్స్ క్లీన్ ఎనర్జీలోకి 344 మిలియన్ డాలర్లు వచ్చాయి. ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్‌లోకి దాదాపు అంతక్రితం ఆర్థిక సంవత్సరం స్థాయిలోనే 3.6 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఫిన్‌టెక్ సంస్థలు 14 శాతం అధికంగా 2.4 బిలియన్ డాలర్లు దక్కించుకున్నాయి. రిటైల్ స్టార్టప్‌లలోకి పెట్టుబడులు 32 శాతం క్షీణించి 3.5 బిలియన్ డాలర్ల నుంచి 2.4 బిలియన్ డాలర్లకు తగ్గాయి. ఐపీవోలపరంగా టెక్ సంస్థల ఇష్యూలు 52 శాతం పెరిగి 47కి చేరాయి. లెన్స్‌కార్ట్, గ్రో, మీషోలాంటి బడా ఐపీవోలు వీటిలో ఉన్నాయి. 2024--25లో 4 అంకురాలు యూనికార్న్ హోదా (1 బిలియన్ డాలర్ల పైగా వేల్యుయేషన్) దక్కించుకోగా, 2025--26లో ఇది 50 శాతం పెరిగి 6 స్టార్టప్‌లకు చేరింది.

# హంగామా..ఆర్భాటం లేని తెలుగు హీరోయిన్!



హీరోయిన్లు అయ్యారంటే? వాళ్ల బ్యాక్ గ్రౌండ్ స్ట్రాంగ్ గానే ఉంటుంది. ఆ మాత్రం సపోర్ట్ లేకుండా ఇండస్ట్రీకి రారుబిజినెస్ మెన్ కుమార్తెలు..ఆర్మీ ఆఫీసర్ల కూతుళ్లు..రాజకీయ నాయకుల కూతుళ్లు కనిపిస్తుంటారు. దాదాపు అంతా హైఫై ఫ్యామిలీ నుంచి వచ్చిన వారే ఉంటారు. వారి కెరీర్ ఎలా ఉండాలి? అన్నది స్కూల్ డేస్ లోనే డిసైడ్ అయిపోతుంది. అందుకు తగ్గట్టు ప్రణాళిక సిద్ధం చేసుకుని తాము అనుకున్న రంగంవైపు వెళ్తుంటారు.అలాంటి కుటుంబాల నుంచి వచ్చిన వారంతా దాదాపు గోల్డ్ స్పూన్ అన్నట్లే ఉంటారు. చిన్నప్పటి నుంచి కష్టాలనేవి లేకుండా పెరుగుతారు.

**శ్రీలీల వాళ్లకి భిన్నంగా:**

కార్పోరేట్ స్కూల్స్.. కాలేజీల్లో చదువులు ముగిస్తారు. అటుపై మోడలింగ్, యాడ్స్ అంటూ మెల్లగా సినిమాల్లోకి వస్తారు. నటిగా సక్సెస్ అవుతారా? లేదా? అన్నది తర్వాత సంగతి. హీరోయిన్ గా మ్యాకప్ వేసుకోవడం మాత్రం తప్పనిసరి. దాదాపు నార్త్ సహా సౌత్ లో తమిళ నాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చే వారు ఎక్కువగా కనిపిస్తుంటారు. ఆ ప్రాంతాల నుంచి హీరోయిన్లగా దిగుమతి అయ్యేవారు..ప్రత్యేకించి నార్త్ నుంచి వచ్చే వారు కాస్త ఆర్భాటంగానే కనిపిస్తారు. కానీ తెలుగు హీరోయిన్ శ్రీలీల మాత్రం అలాంటి వారికి భిన్నం అంటుంది.

**నలుగురిలో కలిసే నటి:**

చిన్నప్పటి నుంచి తాను ఎలాంటి కష్టాలు.. సమస్యలు..ఇబ్బందులు లేకుండా పెరిగినా? గోల్డ్ స్పూన్ లా ఉండటం మాత్రం తనకు ఎంత మాత్రం నచ్చదంది. చాలా సింపుల్ గా లైఫ్ లీడ్ చేయడం ఇష్టమంది. హంగామా, ఆర్భాటం చేయడం...ఇంగ్లీష్ లో పుట్టి పెరిగిన అమ్మాయిలా రకరకాల స్లాంగ్స్ లో మాట్లాడటం ఇలాంటివి చేయడం తనకు నచ్చవంది. ఇంట్లో సాధారణ తెలుగు అమ్మాయిలా ఉంటానంది. తల్లిదండ్రులతో నడుచుకునే విధానం గానీ...ఇతర కుటుంబ సభ్యులతో మెలిగే విధానం అంతా చాలా సింపుల్ గా ఉంటుందని తెలిపింది.

**శ్రీలీల డౌన్ టూ ఎర్త్:**

చుట్టు పక్కల వారితోనూ..తెలిసిన వారిన ఆప్యాయంగా పలకరిచండం వంటివి చిన్న నాటి నుంచి తనకున్న అలవాటు గా పేర్కొంది. తానేదో సినిమా నటిని అని మూతి బిగించుకుని మూల కూర్చోవడం...బిల్డప్ లు కొట్టడం తనకు అస్సలు అలవాటు లేవంది. తానెంత సరదాగా ఉంటాను అన్నది సోషల్ మీడియాలో తన పోస్ట్ చేసిన వీడియోలు చూస్తే అర్థమవుతుందని తెలిపింది. శ్రీలీల చెప్పిందంతా అక్షర సత్యం. ఈ తెలుగు నటి ఎంతో డౌటన్ ఎర్త్ ఉంటుంది.






## ప్యారడైజ్ నుంచి కాయదు లోహర్ లుక్ విడుదల




నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయదు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయదు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూాఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.

# స్వయంభు టీజర్‌కు భారీ స్పందన




టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.




# థాయ్ అందాల నడుమ నైరా స్కిన్ షో



తెలుగు సినిమా 'ఆ ఒక్కడు'తో 2009లో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నైరా బెనర్జీ. మొదటి సినిమా పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. అయినా కూడా ప్రయత్నాలు ఆపలేదు. తదుపరి ఏడాది మూడు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తెలుగు సినిమాలతో పాటు హిందీ సినిమాల్లోనూ నటించింది. కానీ అక్కడ, ఇక్కడ ఆశించిన స్థాయిలో విజయాలను దక్కించుకోలేక పోయింది. రామ్ చరణ్ హీరోగా నటించిన ఆరంజ్ సినిమాలో స్పెషల్ అప్పియరెన్స్ ఇచ్చింది. అది కూడా ఈమెకు ఆఫర్లు తెచ్చి పెట్టడంలో విఫలం అయింది. తెలుగులో ఈమె చేసిన సినిమాలు పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. ఇప్పటికీ ఈమెకు తెలుగు ప్రేక్షకుల్లో గుర్తింపు లేదని చెప్పాలి.

మలయాళం, కన్నడం, తమిళ్ భాషల సినిమాల్లోనూ ఈమెకు ఆఫర్లు వచ్చాయి. కానీ అవేవి ఈమె కెరీర్‌కి టర్న్ తీసుకు రాలేక పోయాయి. దాంతో 2017 నుంచి సినిమాలకు దూరంగా ఉంటూ వచ్చింది. కన్నడంలో ఈమె నటించి పులి సినిమా చివరిది. వెండి తెరకు దూరంగా ఉంటున్న నైరా బెనర్జీ బుల్లి తెరపై ఎంట్రీ ఇచ్చింది. బుల్లి తెరపై ఈమెకు మంచి స్పందన లభించింది. 2019 నుంచి బుల్లి తెరపై ఈమె సందడి కొనసాగుతోంది. హిందీ టీవీ షోలు, రియాల్టీ షో ల్లో ఈమె పాల్గొనడం ద్వారా గుర్తింపు దక్కించుకుంది. ఆకట్టుకునే అందం తో పాటు, మంచి ఫిజిక్ ఉన్నప్పటికీ ఈ అమ్మడికి అదృష్టం కలిసి రాకపోవడంతో ఇప్పటి సినిమాల్లో సక్సెస్ దక్కించుకోలేదు. కరోనా సమయం నుంచి సినిమాలకు దూరంగా ఉంటున్న ఈమెకు చిన్నా చితకా ఆఫర్లు వచ్చినా సున్నితంగా తిరస్కరిస్తుందని తెలుస్తోంది. అయితే సోషల్ మీడియాలో ఈమె రెగ్యులర్‌గా తన అందమైన ఫోటోలను షేర్ చేస్తూనే ఉంటుంది. తాజాగా థాయ్‌లాండ్‌లో సెయిలింగ్‌కు వెళ్లాను అంటూ కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఆ ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. అక్కడి అందాలను పంచుకున్న నైరా తన అందాల విందును చేసింది. నైరా అందాలకు నెటిజన్స్ చూపు తిప్పుకోలేక పోతున్నారు. ఈ మధ్య కాలంలో నైరా బెనర్జీ సోషల్ మీడియాలో ఇలాంటి అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం వల్ల వార్తల్లో నిలుస్తోంది. అందమైన పింక్ బికినీలో ఈమె చాలా అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. అందమైన థాయిలాండ్‌లో అంతకు మించిన అందమైన నైరా బెనర్జీ అందాల ఆరబోత ఫోటోలు ఆకట్టుకుంటున్నాయి. ఇంత అందంగా ఉంటే ఎలా అమ్మడు అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి సోషల్ మీడియాలో ఈ అమ్మడి జోరు కంటిన్యూ అవుతోంది. ఏకంగా ఆరు మిలియన్‌లకు పైగా ఫాలోవర్స్ ఉన్న ఈ అమ్మడు ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతూ ఉంటాయి. అలాంటిది ఇప్పుడు ఈ ఫోటోలతో మరోసారి ఆమె వైరల్ అవుతోంది. నైరా ఇంత అందంగా ఉన్నా సినిమా ఇండస్ట్రీలో రావాల్సిన గుర్తింపు దక్కక పోవడం నిరాశను కలిగిస్తుందని చాలా మంది నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. నాలుగు పదుల వయసుకు చేరువ అవుతున్నా కూడా ఈ అమ్మడి యొక్క అందాల జోరు మాత్రం తగ్గడం లేదు.

## సూపర్ హిట్ ఫ్రాంచైజీ

# హీరోయిన్ బిగ్ ట్విస్ట్..!




బాలీవుడ్‌లో హిట్ సినిమాల ఫ్రాంచైజీల జోరు నడుస్తోంది. ఈ మధ్య కాలంలో పలు ఫ్రాంచైజీ సినిమాలు వచ్చి పాజిటివ్ రెస్పాన్స్‌ను దక్కించుకున్నాయి. అందుకే ముందు ముందు రాబోతున్న ఫ్రాంచైజీ సినిమాల కోసం అభిమానులు, సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. షారుఖ్ ఖాన్ నటించిన 'డాన్' ఫ్రాంచైజీ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. దాంతో డాన్ 3 సినిమా కోసం చాలా కాలంగా ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. డాన్ 2 వచ్చి దశాబ్ద కాలం దాటిన నేపథ్యంలో ఈ ఫ్రాంచైజీలో మూడో పార్ట్‌కి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ మధ్య డాన్ 3 అధికారిక ప్రకటన వచ్చిన విషయం తెల్సిందే. డాన్ 3 లో షారుఖ్ ఖాన్ కాకుండా రణ్వీర్ సింగ్ నటించబోతున్నాడు. ఇప్పటికే ఆ విషయమై అధికారిక ప్రకటన వచ్చింది. అయితే సినిమాలో కీలక పాత్రలో బాలీవుడ్ స్టార్స్ పలువురు కనిపించబోతు న్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై మరింత క్లారిటీ రావాల్సి ఉంది. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ఈ సినిమాకు దర్శకత్వం వహించబోతున్నాడు. డాన్ 3 సినిమాను ప్రకటించిన సమయంలో రణ్వీర్ సింగ్‌కు జోడీగా ముద్దుగుమ్మ కియారా అద్వానీని ఎంపిక చేయడం జరిగింది. దాదాపు ఏడాది క్రితమే టాక్స్ నడిచాయి. ఆ సమయంలో కియారా అద్వానీ డాన్ 3 లో నటించేందుకు ఆసక్తి కనబర్చింది, అంతే కాకుండా ఆ సినిమా షూటింగ్ కోసం ఎదురు చూస్తున్నట్లు సన్నిహితులతో చెబుతూ ఉండేది. డాన్ 3 షూటింగ్ ప్రారంభంలో జాప్యం జరగడంతో పాటు, కియారా అద్వానీ గర్భవతి కావడంతో సందిగ్ధం నెలకొంది. డాన్ 3 సినిమాలో కియారా అద్వానీ నటించాలంటే సినిమా మరో ఏడాదిన్నర నుంచి రెండేళ్ల సమయం వెయిట్ చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే కియారా అద్వానీ ప్రస్తుతం గర్భవతి కావడంతో, ఆమె బిడ్డకు జన్మనిచ్చి, కొన్నాళ్ల విశ్రాంతి తీసుకునే వరకు వెయిట్ చేయాల్సి ఉంటుంది. అందుకే కియారా అద్వానీ స్థానంలో మరో హీరోయిన్‌ను ఎంపిక చేసే విషయమై మేకర్స్ చర్చలు జరుపుతున్నారని వార్తలు వస్తున్నాయి. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం డాన్ 3 సినిమాలో కియారా అద్వానీ స్థానంను కృతి సనన్ భర్తీ చేసే



అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది ఆరంభం నుంచి ప్రారంభం కాబోతున్న డాన్ 3 షూటింగ్‌కి కియారా అద్వానీ పాల్గొనే అవకాశాలు లేవు. అందుకే ఈ సినిమాలో ఆమెకు బదులుగా బాలీవుడ్‌లో ఈ మధ్య ఫుల్ బిజీగా ఉన్న ముద్దుగుమ్మ కృతి సనన్ ని ఎంపిక చేయడం జరిగిందని తెలుస్తోంది. ఈమధ్య కాలంలో కియారా అద్వానీ పలు సినిమాలను గర్భం దాల్చడం వల్ల వదులుకున్నట్టు వార్తలు వస్తున్నాయి. వాటన్నింటిలో డాన్ 3 ఖచ్చితంగా చాలా పెద్ద ప్రాజెక్ట్‌గా చెప్పుకోవాలి. వార్ 2 సినిమాతో రాబోతున్న కియారా అద్వానీకి డాన్ 3 మిస్ కావడం కెరీర్‌లోనే బిగ్ పాయింట్‌గా నిలిచే అవకాశాలు ఉన్నాయి. కియారా అద్వానీ 2027 వరకు రీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు లేవని ఆమె సన్నిహితులు అంటున్నారు. కియారా అద్వానీ మాత్రం ఎప్పుడు రీ ఎంట్రీ అనే విషయాన్ని క్లారిటీ ఇవ్వలేదు.

# తమ్ముడు టైటిల్ కోసం నాగార్జున పెద్దమనసు




సినీ పరిశ్రమలో సినిమా టైటిల్స్ మారడం, ఒకరి దగ్గరున్న టైటిల్ మరొకరు తీసుకోవడం చాలా సాధారణ విషయం. ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ అయిన టైటిల్‌ను అవసరమైతే రిక్వెస్ట్ ద్వారా లేదా పరస్పర అంగీకారంతో మార్పిడి చేసుకోవడం తరచూ జరుగుతూనే ఉంటుంది. అలాంటి అరుదైన, ఆసక్తికర సంఘటనల్లో ఒకటి పవన్ కళ్యాణ్ మరియు నాగార్జున మధ్య జరిగిన 'తమ్ముడు' టైటిల్ వ్యవహారం. 'తొలిప్రేమ' భారీ విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఆ వెంటనే దర్శకుడు అరుణ్ ప్రసాద్ తో కలిసి ఆయన చేసిన సినిమా 'తమ్ముడు'. ఈ చిత్రం విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, పవన్‌ను యూత్ ఐకాన్‌గా మరింత బలపరిచింది. ముఖ్యంగా పాటలు, స్టైల్, యాక్షన్, కామెడీ అన్నీ కలిసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 'తమ్ముడు' అనే టైటిల్ మొదట నాగార్జున వద్దే ఉంది.

ఆయన, హరికృష్ణ కలిసి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ఒక సినిమా చేయాలని ప్లాన్ చేశారు. ఆ కథకు 'తమ్ముడు' అనే టైటిల్‌ను నిర్ణయించి ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ కూడా చేయించారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమా కోసం నిర్మాత శివ రామకృష్ణ ఆ టైటిల్‌ను నాగార్జునను అభ్యర్థించగా, ఆయన సానుకూలంగా స్పందించి 'తమ్ముడు' టైటిల్‌ను ఇచ్చేశారు. తరువాత నాగార్జున తన సినిమాకు 'సీతారామరాజు' అనే టైటిల్ పెట్టుకున్నారు. ఆ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది. ఇదే సమయంలో పవన్ నటించిన 'తమ్ముడు' కూడా భారీ హిట్ అయింది. ఇది టాలీవుడ్‌లోని సానుకూల వాతావరణాన్ని, కళాకారుల మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.

# 'పుష్ప' జోడీ మరోసారి?



పుష్పరాజ్‌గా అల్లు అర్జున్... శ్రీవల్లిగా రష్మిక కలిసి 'పుష్ప' సినిమాలతో చేసిన సందడి అంతా ఇంతా కాదు. మరొకరిని ఊహించుకోలేం అనేంతగా ఆ పాత్రల్లో ఒదిగిపోయారు. ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకి హైలెట్‌గా నిలిచింది. విజయవంతమైన ఆ జోడీ మరోసారి తెరపై సందడి చేయనున్నట్టు సమాచారం. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇందులో ముగ్గురు కథానాయికలకి చోటుందని సమాచారం. ఓ కథానాయిక దీపికా పదుకొణే ఎంపికయ్యారు. మరో పాత్ర కోసం మృణాల్ ఠాకూర్ దాదాపుగా ఎంపికైనట్టు సమాచారం. మరో కథానాయికగా రష్మిక నటించనున్నట్టు సమాచారం. ఇదివరకు జాన్వీ కపూర్ పేరు వినిపించింది. అయితే చిత్రబృందం రష్మిక మందన్నతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. అన్నీ కుదిరితే ఈ జోడీ మరోసారి తెరపై సందడి చేయడం ఖాయం. అల్లు అర్జున్ – అట్లీ కలయికలో సినిమాపై రోజుకొక ఆసక్తికరమైన ప్రచారం సాగుతోంది. హాలీవుడ్‌కి చెందిన ఓ అగ్ర హీరోని ఇందులో ఓ కీలక పాత్ర కోసం సంప్రదించినట్టు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న ఈ సినిమాని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -“APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,“D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .